సాక్షి
వైఎస్సార్ జిల్లా

శనివారం ၊ 21 ၊ అక్టోబర్ ၊ 2023



రెండో రోజూ ఐటీ దాడులు
ప్రొద్దుటూరులోని నగల దుకాణాల్లో గురువారం ఇన్‌కంట్యాక్స్ అధికారులు సోదాలు నిర్వహించారు. వ్యాపారుల ఫోన్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. -IIలో



నెల్లూరు జట్టుకు ఆధిక్యం
కడప నగరంలో నిర్వహిస్తున్న అండర్–23 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం రసవత్తరంగా సాగింది. -IIలో

గరిష్టం/కనిష్టం
35.6/23.6

వాతావరణం
జిల్లాలో శుక్రవారం 23.6 – 35.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

కమలాపురం దర్గాకు ప్రొటోకాల్
కమలాపురం: పట్టణంలోని అబ్దుల్ గఫార్ షా ఖాద్రి దర్గాకు ప్రభుత్వం నుంచి చాదర్ సమర్పించి ప్రొటోకాల్ పాటించాలని మైనార్టీస్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ సెక్రటరి మహమ్మద్ ఇంతియాజ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏటా ఏప్రిల్ మాసంలో ఈ దర్గాలో ఉరుసు జరుగుతుంది. ప్రభుత్వం నుంచి చాదర్ సమర్పించాలని గత ఏడాది ఏప్రిల్‌లో కమలాపురం ఎమ్మెల్యే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించారు. సీఎం చొరవతో అప్పటి జేసీ సాయికాంత్ వర్మ ఉరుసు ఉత్సవాల్లో చాదర్ సమర్పించారు. తాజాగా శాశ్వత ప్రొటోకాల్ పాటించాలంటూ ఉత్తర్వులు అందాయి. దర్గా పీఠాధిపతి ఫైజుల్ గఫార్ షాఖాద్రి, యువనేత ఇస్మాయిల్ హర్షం వ్యక్తం చేశారు.

పిల్లలు బడిలోనే ఉండాలి



విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈఓ

కడప ఎడ్యుకేషన్: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డి పేర్కొన్నారు. కడప నగరంలోని బడి బయట పిల్లలపై ఆయన శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇంటింటి సర్వే చేసి గత ఏడాది ఎనిమిదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. పనులు మాన్పించి బడికి పంపాలని సూచించారు. పిల్లల కోసం ప్రభుత్వం అన్ని వసతులు కల్పించిందని తెలిపారు. డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథరెడ్డి, కేవీ.సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సలాం..పోలీస్

శాంతిభద్రతలను కాపాడటమే వారి లక్ష్యం. ఎండావాన, రాత్రీ పగలు అనే తేడా లేకుండా విధుల్లో కొనసాగుతారు. 24 గంటలు అందుబాటులో ఉండి ప్రజలకు అండగా ఉంటారు. కుటుంబంతో కలిసి జరుపుకొనే పండుగలను సైతం త్యజించి.. సమాజం కోసం సమయం వెచ్చిస్తారు. అవసరమైతే ప్రాణాలను సైతం అర్పిస్తారు. జిల్లాలోనూ అలాంటి త్యాగధనులు ఉండటం ఎంతో గర్వకారణం.

- నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం
- ఆర్‌ఎస్‌ఐ నరసింహులు ప్రాణత్యాగం



నివాళులు అర్పిస్తున్న పోలీసులు

కడప అర్బన్: దేశవ్యాప్తంగా పోరాటాలలో ప్రాణాలర్పించిన వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ శనివారం కడప పరేడ్ మైదానంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని జరుపుకొంటున్నారు. వారి త్యాగాలను స్మరిస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచేలా చర్యలు చేపడుతున్నారు.

అక్టోబర్ 21న సంస్మరణ దినోత్సవం

భారత్–చైనా సరిహద్దుల్లో లడక్ ప్రాంతంలో హాట్ స్ప్రింగ్స్ వద్ద 1959 అక్టోబర్ 21న మన దేశ సైన్యం, చైనా వారితో పోరాడి సీఆర్‌పీఎఫ్ విభాగానికి చెందిన 10 మంది సైనికులు వీరమరణం పొందారు. వారి ప్రాణ త్యాగాన్ని ప్రతి ఏడాది స్మరించుకుంటూ పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకొంటున్నాం. సరిహద్దు భద్రతాదళం, ఇండో–టిబెటిన్ బోర్డర్ భద్రతా దళాలు ఏర్పడక ముందు సరిహద్దులను రక్షించే మహత్తర బాధ్యతను కేంద్ర రిజర్వ్ పోలీసు (సీఆర్‌పీఎఫ్) బలగాలు నిర్వర్తించేవి. 1959 అక్టోబర్, 21న డీఎస్పీ కరమ్‌సింగ్ నేతృత్వంలో పంజాబ్‌కు చెందిన 21 మంది సభ్యుల బృందం సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తుండగా, చైనా రక్షణ బలగాలు సియాచిన్ భూభాగాన్ని అక్రమించేందుకు ప్రయత్నించింది. సీఆర్‌పీఎఫ్ దళం హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో దీటుగా ఎదురొడ్డి పోరాడింది. 10 మంది భారత జవాన్లు ప్రాణాలను కోల్పోయారు. ఏటా ఈ పవిత్ర స్థలాన్ని సందర్శించి నివాళులర్పించడం ఆనవాయితీగా వస్తోంది.

జిల్లాలో అమరవీరులు

వైఎస్సార్ జిల్లాలోని ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ విభాగంలో ఎస్‌ఐగా పనిచేస్తూ నరసింహులు చక్రాయపేట మండలం రెడ్డిచెరువు అటవీ ప్రాంతంలో మావోయిస్టులతో వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించారు. 2002 బ్యాచ్‌కు చెందిన ఈయన కర్నూలు జిల్లా వాసి. ఫుట్‌బాల్ ఆటగాడిగా పేరొందారు. ఆయన మరణానంతరం అప్పట్లో ప్రతి ఏడాది పోలీసుల మధ్య ఆయన జ్ఞాపకార్థం ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను నిర్వహించేవారు.

ఎస్పీ ఉమేష్‌చంద్ర జ్ఞాపకార్థం..

జిల్లాలో ఎస్పీగా 1995 జూన్ 5 నుంచి 1997 ఆగస్టు 8 వరకు పని చేసిన చదలవాడ ఉమేష్ చంద్ర ఆ హైదరాబాద్‌లో అసాంఘిక శక్తుల దుశ్చర్యలకు ప్రాణాలర్పించారు. జిల్లాలో ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఆయన చిత్రపటాన్ని పెట్టుకుని ఆరాధిస్తున్నారు. కడప ఉమేష్ చంద్ర మెమోరియల్ కల్యాణ మండపం నిర్మించి, నిర్వహిస్తున్నారు. ఈ కల్యాణ మండపాన్ని ఇటీవల సెంట్రల్ ఏసీగా తయారు చేయించారు. ప్రజలకు, పోలీసు కుటుంబ సభ్యులకు అందుబాటులోకి తీసుకుని వచ్చారు.


అమరవీరుల కుటుంబాలకు అండ



అమరులైన వారి కుటుంబాలకు అండగా వుంటున్నాం. పోలీసుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నాం. పోలీసు సిబ్బందితోపాటు వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా ప్రముఖ వైద్య పరీక్షలు నిర్వహించేందుకు నిర్ణయాలు తీసుకున్నాం.
– సిద్దార్థ్ కౌశల్, ఎస్పీ, వైఎస్సార్ జిల్లా

నేతల అంతర్మథనం

- పచ్చనేతల మాయమాటలపై తిరగబడుతోన్న ప్రజానీకం
- వ్యక్తిగత దూషణలకు దిగుతోన్న ఇన్‌ఛార్జులు
- తెలుగు తమ్ముళ్లకు అందుతోన్న ప్రభుత్వ పథకాలు
- జిల్లాలో అర్హులకు రూ.7,197.48 కోట్ల లబ్ధి



సాక్షి ప్రతినిధి, కడప: అర్హత ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. పార్టీలు, వర్గాలకతీతంగా సంక్షేమం అండగా నడిపిస్తోంది. నాటి చంద్రబాబు సర్కార్‌లో ఉన్నట్లు జన్మభూమి కమిటీల సిఫార్సులు అవసరం లేదు. ప్రజల వద్దకే పాలన వచ్చి చేరింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అపార ప్రజా మద్దతు దక్కుతోంది. ఈ పరిస్థితుల్లో తెలుగుదేశం ఇన్‌ఛార్జులు కల్లిబొల్లి కబుర్లతో ప్రజల చెంతకు చేరితే, ప్రతిఘటన ఉత్పన్నమవుతోంది. ప్రజానీకం నిలదీస్తే సమాధానం చెప్పుకోలేక మథన పడుతున్నారు. వ్యక్తిగత దూషణలకు దిగుతోన్న నేపథ్యం తెరపైకి వస్తోందని పరిశీలకులు భావిస్తున్నారు.

- 2019, మే నెల 30న సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఆదే రోజున వర్గాలు, పార్టీలు, ప్రాంతాలను చూడకుండా రాజకీయాలకతీతంగా నవరత్నాలు అందిస్తామని స్పష్టం చేశారు. చెప్పిన మాట ప్రకారం తర, తమ, భేదం లేకుండా పథకాలకు అర్హులైతే గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా లబ్ధి చేకూరుతోంది. ఇందులో తెలుగుతమ్ముళ్లకు సైతం సంక్షేమం వర్తిస్తోంది. అప్పట్లో తెలుగుతమ్ముళ్ల నేతృత్వంలో ఏర్పాటైన జన్మభూమి కమిటీల లాగా, మరెలాంటి సిఫార్సులు అవసరం లేదు. పాలన ప్రక్షాళన చేశారు. అర్హుల ఇళ్ల ముంగిటకు సంక్షేమం తీసుకెళ్లారు. కోవిడ్ వైరస్ విపరీతంగా వ్యాప్తి చెందిన వ్యవస్థలు అస్థవ్యస్థమైనా, సంక్షేమాన్ని ఆపలేదు. వెరశి ప్రజల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజల నుంచి మద్దతు దక్కుతోంది.

టీడీపీ నేతలకూ సంక్షేమ ఫలాలు

రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు వివిధ పథకాల ద్వారా రూ.7,197.48 కోట్లు నేరుగా లబ్ధి చేకూర్చింది. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు దక్కాయి. ఈ క్రమంలో టీడీపీ క్రియాశీలక నేతలకు సైతం పెద్ద ఎత్తున సంక్షేమం దక్కింది. బద్వేల్ మున్సిపాలిటీలో టీడీపీ కౌన్సిలర్ సోమేశుల సుధామణి కుటుంబానికి రూ.11.6 లక్షలు సమకూరింది. ఖాజీపేట మండలశాఖ అధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మీరెడ్డి కుటుంబానికి రూ.5.25 లక్షలు దక్కింది. చాపాడు టీడీపీ నేత మార్తల నరసింహారెడ్డి కుటుంబానికి దాదాపు రూ.4 లక్షల లబ్ధి చేకూరింది. జిల్లా వ్యాప్తంగా టీడీపీ క్రియాశీలక నేతలందరికీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్‌లో సంక్షేమ ఫలాలు దక్కాయి. టీడీపీ సామాన్య కార్యకర్త నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న నేతల వరకూ అర్హుల జాబితాలో ఉండడం మరో విశేషం.

విమర్శిస్తే సహించని ప్రజానీకం...

తెలుగు తమ్ముళ్ల ప్రభుత్వాన్ని విమర్శిస్తే సామాన్య ప్రజలు సహించలేకున్నారు. కడపలో వైఎస్సార్ కాలనీలో ఇన్‌ఛార్జి మాధవీరెడ్డి మాటలను ఖండిస్తూ అడ్డుతగిలిన నేపథ్యమే ఉదాహరణ. ఈ పరిస్థితిలో మరింతగా రెచ్చిపోయిన ఆమె వ్యక్తిగతంగా మంత్రి అంజాద్‌బాషాపై ఆరోపణలు సంధించడం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం టీడీపీ ఇన్‌ఛార్జిలు గండ్లూరు ప్రవీణ్ కుమార్‌రెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, పుత్తా నరసింహారెడ్డిలు ఇలాగే వ్యవహరిస్తున్నారు. వ్యక్తిగత విమర్శలు మినహా ప్రజలకు పథకాలు అందలేదని కానీ, మ్యేనిఫెస్టో అమలు చేయలేదని కానీ ఆరోపణలు చేయడం లేదని పరిశీలకులు వెల్లడిస్తున్నారు. ప్రజల నుంచి టీడీపీ నేతలకు ప్రతిఘటన ఉత్పన్నం కావడం వెనుక సంక్షేమ పథకాలేనని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

కన్యాకుమారి రైలు మళ్లింపు
కడప కోటిరెడ్డిసర్కిల్: కన్యాకుమారి–పూణె–కన్యాకుమారి (16381/82) రైలును దారి మళ్లించినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. ఈ నెల 22 నుంచి 29వ తేదీ వరకు ఈ రైలు గుత్తి, ధర్మవరం, పాకాల మీదుగా కన్యాకుమారికి వెళ్తుందన్నారు. ప్రయాణీకులు ఈ విషయాన్ని గమనించి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని కోరారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

వాసవీ కన్యకాపరమేశ్వరీదేవిని దర్శించుకున్న ఎంపీ, ఉప ముఖ్యమంత్రి, మేయర్



ఆలయంలో హారతి తీసుకుంటున్న ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్‌సురేష్‌బాబు, తదితరులు

కడప కార్పొరేషన్: రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పది కాలాలపాటు వర్ధిల్లాలని వాసవీ కన్యకాపరమేశ్వరీదేవిని వేడుకున్నట్లు కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్.అవినాష్‌రెడ్డి అన్నారు. కడప నగరంలో ప్రసిద్ధిగాంచిన వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయాన్ని ఉపముఖ్యమంత్రి అంజద్ బాషా, మేయర్ సురేష్‌బాబులతో కలిసి శుక్రవారం ఆయన సందర్శించారు. ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి, రైతులతోపాటు అన్ని వర్గాల ప్రజలు సుఖ శాంతులతో ఉండాలని ప్రార్థించానన్నారు. అంతకు ముందు ఆలయ అర్చకులు మేళ తాళా మధ్య ఎంపీ, డిప్యూటీ సీఎం, మేయర్‌లకు పూర్ణ కుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. కన్యకాపరమేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎంపీ సీతారామలక్ష్మణ హనుమాన్‌లను దర్శించుకున్నారు. ఆర్యవైశ్య సంఘం నేతలు పలు సమస్యలను ఎంపీ అవినాష్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్ కుమార్, కార్పొరేటర్లు కె.సూర్యనారాయణరావు, మల్లికార్జున, రామలక్ష్మణ్‌రెడ్డి, ఎస్‌ఏ షంషీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరంజన్‌రెడ్డి, సీహెచ్ వినోద్, నాని, షఫీవుల్లా, డా.శివానాయక్ పాల్గొన్నారు.

కార్పొరేటర్‌కు పరామర్శ

నగరంలోని అరుణాచల హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న 38వ డివిజన్ కార్పొరేటర్ మగ్బూల్‌బాషాను ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబులు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని ఆయనను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించి మగ్బూల్ బాషా త్వరగా కోలుకునేలా చేయాలని వైద్యులకు సూచించారు.

స్టీల్‌ప్లాంట్ పనులు వేగవంతం
- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ప్రొద్దుటూరు: త్వరలో స్టీల్ ప్లాంట్ పనులు వేగవంతం అవుతాయని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రూ.2కోట్ల వ్యయంతో నిర్మించిన సిరిపురి కాంప్లెక్స్‌ను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డితో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మీడియాతో మాట్లాడుతూ కొన్ని నెలల క్రితం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ చేశారన్నారు. ఏపీ హైగ్రేడ్ స్టీల్ ప్లాంట్‌ను జిందాల్ స్టీల్ ప్లాంట్‌గా కన్వర్ట్ అవుతుందని తెలిపారు. సంబంధిత కంపెనీకి ఈసీ వస్తే పనులు మొదలవుతాయన్నారు. జిందాల్ – జపనీస్ కంపెనీల మధ్య ఎంఓయూ కుదిరిందని, కొత్త టెక్నాలజీతో పనులు చేపట్టనున్నారని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ నిర్మాణంతో ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ప్రాంతాలు జంట పట్టణాలుగా అభివృద్ధి చెందుతాయన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో అవే చార్జీలు
కడప కోటిరెడ్డిసర్కిల్: దసరా పండగ సందర్భంగా సాధారణ ఛార్జీలతోనే ప్రత్యేక సర్వీసులను నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పాలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. ప్రయాణీకులపై ఎలాంటి అదనపు ఛార్జీల భారం వేయడం లేదని స్పష్టం చేశారు. విజయవాడ, హైదరాబాదు, చెన్నై, బెంగుళూరు, విశాఖపట్టణం, కాకినాడ, తిరుపతి, అనంతపురం, కర్నూలు, నెల్లూరు, చిత్తూరు, మదనపల్లె తదితర ప్రాంతాలకు సర్వీసులు నడుపుతున్నామన్నారు. రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణీకులకు ఛార్జీలో పది శాతం రాయితీ ఇస్తున్నామన్నారు. అధికారులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా డ్యూటీలు వేశామన్నారు.

ఆరోగ్య సంరక్షణే ధ్యేయం
కడప రూరల్: ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం 20 ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు జరిగాయి. ఎర్రగుంట్ల మండలంలో జరిగిన వైద్య శిబిరంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి, కాశినాయన మండలం గొంటువారిపల్లెలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, రాజుపాలెం మండలం వెలవల గ్రామంలో ఎమ్మెల్యే శివప్రసాద్ రెడ్డి మిగతా ప్రాంతాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

వేర్వేరు ప్రాంతాల్లో ఘటనలు

బ్రహ్మంగారిమఠం : జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. బ్రహ్మంగారిమఠం మండల పరిధి బద్వేల్, మైదుకూరు జాతీయ రహదారిలోని జెడ్ కొత్తపల్లె దగ్గర బొలేరో ట్యాలీ వాహనం ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొనడంతో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రేకులకుంట పంచాయతీ ఆర్ గొల్లపల్లెకు చెందిన పాలకొండయ్య(25) ద్విచక్ర వాహనంపై జీవీ సత్రంకు వెళ్తుండగా జెడ్ కొత్తపల్లె దగ్గరకు రాగానే.. ప్రొద్దుటూరు నుంచి నెల్లూరుకు వెళ్తున్న బొలేరో ట్యాలీ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో పాలకొండయ్య(25) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ విద్యాసాగర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన పాల కొండయ్య, నసీం

జీవనోపాధి కోసం వచ్చి..

రాజుపాళెం : జీవనోపాధి కోసం ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ రాజగోపాల్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తర ప్రదేశ్ బల్రంపూర్ జిల్లా గుర్రిహసర్వకు చెందిన నసీం (21) ఇక్కడ ఇళ్లకు పీఓపీ చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. మండలంలోని వెలవలి గ్రామంలో పీఓపీ పని పూర్తి చేసుకుని నసీం తన స్నేహితుడితో ద్విచక్ర వాహనంపై ప్రొద్దుటూరుకు బయలుదేరాడు. అతివేగంగా వెళ్లడంతో రాజుపాళెం మండలంలోని వెలవలి – కొర్రపాడు గ్రామాల మధ్యలో మలుపు వద్ద వాహనాన్ని అదుపు చేసుకోలేక కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నసీంను ప్రొద్దుటూరు ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతుడితోపాటు ఇక్కడికి వచ్చిన ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి సహవాజు ఫిర్యాదు మేరకు ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

టీడీపీ పాలనలో ప్రజలకు చేసింది శూన్యం

– ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి



వల్లూరు : దశాబ్దాల పాటు అధికారంలో వున్న టీడీపీ ప్రజలకు చేసిన మేలు శూన్యమని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి విమర్శించారు. కడపలోని వైఎస్‌ఆర్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. మూడు సార్లు సీఎంగా వున్న చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని టీడీపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు రాష్ట్రంలోని ఏ ఒక్క సామాజిక వర్గానికైనా ఫలానా మేలు చేశామని చెప్పుకునే ఆత్మ విశ్వాసం గానీ, ధైర్యం గానీ వుంటే వాటిపై పుస్తకం విడుదల చేయాలన్నారు. ఆ పార్టీ నేతలు తమ పార్టీ ప్రజలకు చేసిన మేలు ఇదీ అని చెప్పుకోలేని దీన స్థితిలో వున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతం హామీలను నెరవేర్చి, తాము చేసిన మేలు ఇదీ అని, మేం మంచి చేసి వుంటేనే మాకు మద్దతివ్వండని ఇంటింటికీ తిరిగి ప్రజలను ధైర్యంగా కోరుతున్న పార్టీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్‌ఆర్‌సీపీ అన్నారు. రాష్ట్రంలో 80 శాతం సామాజిక వర్గాలకు సంపూర్ణంగా మేలు చేసి రూ 2.38 లక్షల కోట్లను డీబీటీ ద్వారా నేరుగా అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ×ఏపీ హేట్స్ జగన్ । అంటూ పుస్తకాన్ని విడుదల చేయడం ఆ పార్టీ దిగజారుడు తనానికి నిదర్శనమని విమర్శించారు. వైఎస్‌ఆర్ రైతు భరోసా పథకాన్ని అమలు చేయడమే కాక రైతు భరోసా కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చి విత్తనం నుంచి పండిన పంటల కొనుగోలు వరకు రైతులకు భరోసా ఇస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వారి మన్ననలు పొందుతున్నారని అన్నారు. డ్వాక్రా మహిళలకు 27 వేల కోట్లను నాలుగు విడతల్లో మాఫీ చేస్తానని చెప్పి ఇప్పటికే మూడు విడతల్లో 20 వేల కోట్లను పొదుపు సంఘాలకు జమ చేసిన ఘనత జగన్‌దని కొనియాడారు. చిన్న పిల్లవాడి నుంచి వృద్ధుల వరకు ఈ రాష్ట్రానికి జగన్ కావాలని ముక్త కంఠంతో నినదిస్తుంటే, హైదరాబాద్‌లో నివాసం వుంటూ కనీసం ఈ రాష్ట్రంలో ఇంటిని కూడా నిర్మించుకోకుండా అధికారం కోసం వలస వచ్చే చంద్రబాబును ప్రజలు కోరుకుంటున్నారని పగటి కలలు కనడం ఆ పార్టీ నేతలకే చెల్లిందని విమర్శించారు. 99 శాతం హామీలను అమలు చేసిన వైఎస్‌ఆర్‌సీపీని కాదని, కేవలం 9 వాగ్దానాలను నెరవేర్చి మ్యానిఫెస్టోనే మాయం చేసిన టీడీపీకి ప్రజలు ఎలా మద్దతు పలుకుతారో ఆ పార్టీ నేతలకే తెలియాలని ఎద్దేవా చేశారు.

రెండో రోజూ ఐటీ దాడులు

బంగారు వ్యాపారుల బంధువుల ఇళ్లలోనూ సోదాలు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులో రెండో రోజు కూడా ఐటీ దాడులు కొనసాగాయి. పట్టణంలోని బుశెట్టి జ్యూవెలర్స్, తల్లం జ్యూవెలర్స్, గురురాఘవేంద్ర జ్యూవెలర్స్, బీఎస్‌ఆర్ డైమండ్స్ దుకాణాల్లో గురువారం సెంట్రల్ ఇన్‌కంట్యాక్స్ అధికారులు దాడులు చేపట్టిన విషయం తెలిసిందే. ఆ నాలుగు దుకాణాల్లో శుక్రవారం కూడా సోదాలు కొనసాగాయి. తనిఖీలు నిర్వహిస్తున్న దుకాణాల్లోకి ఎవరినీ అనుమతించలేదు. షాపుల్లో పని చేసే సిబ్బందితోపాటు యజమానుల సెల్‌ఫోన్లు రెండు రోజుల నుంచి పని చేయలేదు. వారి ఫోన్లను ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. కాగా బంగారు దుకాణ యజమానులకు చెందిన కొందరి బంధువుల ఇళ్లలోనూ ఈ తనిఖీలు జరిగినట్లు తెలుస్తోంది. తనిఖీలపై అధికారులు నోరు మెదపలేదు. ఎందుకు దాడులు చేస్తున్నారనే దానిపై తమకు తెలియదని, ఉన్నతాధికారుల ఆదేశాలలతో చేస్తున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా సీజీఎస్టీ చెల్లింపులపైనే ఐటీ అధికారులు దృష్టి సారించినట్లు విశ్వసనీయ సమాచారం.

తెరుచుకోని కొన్ని దుకాణాలు

ఐటీ దాడుల నేపథ్యంలో గురువారం మూసిన కొన్ని బంగారు దుకాణాలు శుక్రవారం కూడా తెరుచుకోలేదు. ప్రతి రోజు రూ.కోట్లలో బంగారు క్రయవిక్రయాలు జరిగే దుకాణాలు ప్రొద్దుటూరులో చాలానే ఉన్నాయి. ఆదాయపన్ను శాఖ అధికారుల దాడుల సమాచారం తెలుసుకున్న బడా వ్యాపారులు షాపులకు తాళం వేశారు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్, దసరా పండుగ కావడంతో వ్యాపారాలు పెద్ద ఎత్తున జరుగుతాయి. రెండు రోజుల నుంచి ఏకధాటిగా నాలుగు దుకాణాల్లో తనిఖీలు జరుగుతుండటంతో మిగతా వ్యాపారుల్లో గుబులు నెలకొంది. తనిఖీలు నాలుగు దుకాణాలకే పరిమితమవుతాయా లేక మరిన్ని షాపులకు విస్తరిస్తాయా అనే టెన్షన్ బంగారు వ్యాపారుల్లో నెలకొంది. శుక్రవారం రాత్రి పొద్దుపోయే వరకు సోదాలు జరిగాయి.



ఐటీ తనిఖీలు జరుగుతున్న ఒక బంగారు దుకాణం బయట ఉన్న సాయుధ బలగాలు

బ్రౌన్ గ్రంథాలయంతో 'జానమద్ది'కి శాశ్వతకీర్తి

కడప కల్చరల్ : 'తెలుగు సూర్యుడు' సీపీ బ్రౌన్ స్మారకంగా గ్రంథాలయాన్ని నిర్మించి లోకంలో శాశ్వతకీర్తిని సంపాదించుకున్న మహోన్నతవ్యక్తి డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి అని యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శుక్రవారం బ్రౌన్ స్మారక గ్రంథాలయ వ్యవస్థాపకులు డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి 99వ జయంతి నిర్వహించారు. తొలుత వీసీ ఆచార్య చింతా సుధాకర్, వైవీయూ పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాదరెడ్డి, పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు కలసి పరిశోధన కేంద్రం ప్రాంగణంలోని డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి కాంస్య విగ్రహానికి, సమావేశ మందిరంలోని జానమద్ది చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ సీపీ బ్రౌన్ సాహిత్యయజ్ఞం చేసిన ప్రదేశంలోనే మొట్టమొదటగా బ్రౌన్ స్మారక భవనాన్ని నిర్మించడం విశేషమన్నారు. డాక్టర్ జానమద్ది పాఠశాల విద్యార్థులు మొదలుకొని ఎందరో దాతలను ఈ గ్రంథాలయ నిర్మాణ యజ్ఞంలో భాగస్వాములను చేశారన్నారు. అరుదైన అనేక గ్రంథాలు సేకరించి, బ్రౌన్ గ్రంథాలయాన్ని ఒక గొప్ప విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దారన్నారు. ఈ కార్యక్రమంలో బ్రౌన్ బాష పరిశోధనకేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథపాలకులు ఎన్.రమేశ్‌రావు, సాహితీవేత్త గానుగపెంట హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ జానమద్ది విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైవీయూ వీసీ, బ్రౌన్ కేంద్రం సిబ్బంది

సివిల్స్ అభ్యర్థులకు 'జగనన్న ప్రోత్సాహం'

కడప రూరల్: సివిల్స్ ప్రిలిమినరీ–2023లో అర్హత సాధించిన అభ్యర్థులకు 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం' అందించనున్నామని సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ విజయక్రిష్ణన్ తెలిపారు. యూపీఎస్సీ ప్రిలిమినరీలో అర్హత సాధించి, ఆర్థికంగా వెనుకబడిన వారికి రూ.1 లక్ష, మెయిన్స్‌లో అర్హత సాధించిన వారికి రూ.50 వేల చొప్పున నగదు ప్రోత్సాహకం ఉంటుందని ఆయన తెలిపారు. అర్హులైన వారు జ్ఞానభూమి.ఏపీ.జీఓవీ.ఐఎన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసి నవంబర్ 4వ తేదీలోపు పంపాలని పేర్కొన్నారు.

నెల్లూరు జట్టుకు ఆధిక్యం

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–23 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ రసవత్తరంగా సాగుతోంది. ఇందులో భాగంగా కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 76 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో.. శుక్రవారం బరిలోకి దిగిన కర్నూలు జట్టు 59.3 ఓవర్లలో 214 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని మనోజ్‌రాజు 75 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్లు నారాయణ 4, అఖిల్ 5 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 43 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. జట్టులోని సుబ్రమణ్యం 64 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్లు కనిష్ 4, ఇస్మాయిల్ 2 వికెట్లు తీశారు. దీంతో నెల్లూరు జట్టు 265 పరుగుల ఆధిక్యంతో కొనసాగుతోంది. కాగా నెల్లూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 303 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

కేఓఆర్‌ఎం మైదానంలో..

కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 286 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కడప జట్టు.. 95.4 ఓవర్లలో మరో 10 పరుగులు జోడించి 296 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని ఆదిల్ హుస్సేన్ 84 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్ దీపక్‌సాయినాథ్ 4, మల్లేశన్ 4 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 83 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 387 పరుగులు చేసింది. జట్టులోని వై.తేజారెడ్డి 120 బంతుల్లో 18 ఫోర్లు, 6 సిక్సర్లతో 152 పరుగులు చేశాడు. కడప బౌలర్లు ఆదిల్ హుస్సేన్ 3, ఆసిఫ్ హుస్సేన్ 3 వికెట్లు తీశారు. దీంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి చిత్తూరు జట్టు 91 పరుగుల ఆధిక్యంతో కొనసాగుతోంది.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య

ఖాజీపేట : అప్పులబాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నాగసానిపల్లె ఎస్సీ కాలనీకి చెందిన జె.రామసుబ్బయ్య (37) తనకు ఉన్న ఎకరాతోపాటు అదనంగా కౌలుకు పొలం తీసుకుని పంటలు సాగు చేసే వాడు. వరి, టమాటతోపాటు వివిధ రకాల పంటలు పండించే వాడు. అలాగే ఆటోను కంతులకు తీసుకుని నడుపుతుండేవాడు. ఈ క్రమంలో సుమారు రూ.15 లక్షలకు పైగా అప్పు అయింది. ఎంత కష్టపడినా అప్పులు తీరక పోవడంతో మానసికంగా కుంగిపోయాడు. తన పొలంలోనే పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. బాధితుడిని కుటుంబ సభ్యులు ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య ఓబులమ్మ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజరాజేశ్వర్ రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.



రామసుబ్బయ్య మృతదేహం

బైక్‌ను ఢీకొన్న కారు.. యువకుడికి గాయాలు

బి.కోడూరు : మండలంలోని ఎర్రిఓబన్నబావి వద్ద శుక్రవారం సాయంత్రం బైక్‌ను కారు ఢీకొనడంతో ఓ యువకుడికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. అక్కుపాలెం గ్రామానికి చెందిన విష్ణు తన ద్విచక్ర వాహనంపై ఎర్రిఓబన్నబావి వద్ద ఉన్న పెట్రోలు బంకు వద్దకు వెళుతుండగా.. బద్వేలు నుంచి పోరుమామిళ్ళకు వెళుతున్న కారు ఎదురుగా వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో విష్ణుకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు బి.కోడూరు పోలీసులు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుడిని 108 వాహనంలో పోరుమామిళ్ళ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



● రకుల్ ● కృతీ శెట్టి

సినిమా తర్వాత సినిమా... ఒకేసారి రెండు లేక మూడు సినిమాలు చేసే హీరోయిన్లు హఠాత్తుగా కొత్త సినిమా సైన్ చేయకపోతే? 'వాట్ నెక్ట్స్' అనే ప్రశ్న ఎదురవుతుంది. ఆ నాయికలు ఇతర భాషల్లో సినిమాలు చేస్తున్నప్పటికీ డైరీలో తెలుగు సినిమా లేకపోవడం ఫ్యాన్స్‌ని నిరుత్సాహ పరిచే విషయం. ప్రస్తుతం తెలుగులో సినిమా సైన్ చేయని నాయికల గురించి తెలుసుకుందాం.

● అనుష్క

వాట్ నెక్ట్స్

● సమంత

గ్యాప్ లేకుండా...

అటు కమర్షియల్ చిత్రాల్లో హీరోయిన్‌గా, ఇటు లేడీ ఓరియంటెడ్ చిత్రాలతో ఆకట్టుకున్న అనుష్క జోరు గతంతో పోలిస్తే ప్రస్తుతం తగ్గిందనే చెప్పాలి. ఏడాదికి ఐదారు తెలుగు సినిమాలు చేసిన ఆమె ప్రస్తుతం ఏడాదికి ఒక్క సినిమాతోనే సరిపెట్టుకుంటున్నారు. 2021, 2022లో అయితే అనుష్క కనీసం ఒక్క తెలుగు సినిమాలోనూ నటించలేదు. ఈ ఏడాది నవీన్ పొలిశెట్టి, అనుష్క జంటగా నటించిన 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' సెప్టెంబర్ 7న విడుదలై, హిట్‌గా నిలిచింది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇక నాన్‌స్టాప్‌గా సినిమాలు చేస్తానని, తెలుగులో గ్యాప్ లేకుండా ప్రాజెక్ట్స్ కమిట్ అవుతానని అన్నారు అనుష్క. ప్రస్తుతం 'కథనార్– ది వైల్డ్ సోర్సెరర్' చిత్రంతో మలయాళ ఇండస్ట్రీలో అడుగు పెడుతున్నారు. అయితే తెలుగులో కొత్త సినిమా ఏదీ సైన్ చేయలేదు.

సంవత్సరం విరామం

దక్షిణాదిలో స్టార్ హీరోయిన్‌గా దూసుకెళుతున్న సమంత సంవత్సరం పాటు సినిమాలకు గ్యాప్ ఇచ్చిన విషయం తెలిసిందే. 'మయోసైటిస్' వ్యాధి బారిన పడిన ఆమె కొన్నాళ్ల పాటు షూటింగ్స్‌కి దూరంగా ఉంటూ చికిత్స తీసుకుని సినిమాలు చేశారు. ఇక సమంత ఫుల్ స్పీడ్‌తో సినిమాలు చేస్తారని ఆశించిన ఆమె అభిమానుల ఆనందం ఆవిరి అయ్యేట్లు ఏడాది పాటు తాను సినిమాలకు గ్యాప్ ఇస్తున్నట్లు ప్రకటించారు సమంత. మయోసైటిస్ పూర్తి స్థాయి చికిత్స కోసమే సమంత ఈ బ్రేక్ తీసుకున్నారనే వార్తలు వస్తున్నాయి. కాగా విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన 'ఖుషి' చిత్రం సెప్టెంబరు 1న విడుదలై, మంచి హిట్‌గా నిలిచింది. 'ఖుషి' వంటి హిట్ మూవీ తర్వాత సమంత నటించనున్న తెలుగు సినిమా ఏంటి? అన్నదానిపై ఎలాంటి స్పష్టత లేదు. ఇకపోతే హిందీలో సమంత లీడ్ రోల్‌లో నటించిన 'సిటాడెల్' వెబ్ సిరీస్, 'చెన్నయ్ స్టోరీస్' (ఇంగ్లీష్–తమిళ్) చిత్రం విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

రెండేళ్లు గ్యాప్

సౌత్‌లో స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగారు రకుల్ ప్రీత్‌సింగ్. తెలుగులో వరుస చిత్రాలతో తన సత్తా చాటిన ఈ బ్యూటీ రెండేళ్లుగా ఒక్క తెలుగు సినిమా కూడా చేయకపోవడం విశేషం. క్రిష్ దర్శకత్వం వహించిన 'కొండపొలం' చిత్రంలో నటించారు రకుల్. 2021 అక్టోబర్ 8న ఆ సినిమా విడుదలైంది. ఆ తర్వాత మరో తెలుగు సినిమా చేయలేదు రకుల్. బాలీవుడ్‌కి పరిమితమై వరుసగా హిందీ సినిమాలు చేస్తున్నారామె. ప్రస్తుతం ఆమె బాలీవుడ్‌లో 'ఐ లవ్ యు', 'మేరీ పత్నీ కా రీమేక్' చిత్రాలతో పాటు తమిళంలో 'ఆయలాన్, ఇండియన్ 2' చిత్రాలు చేస్తున్నారు. అయితే రెండేళ్లుగా కనీసం ఒక్క తెలుగు సినిమా కూడా చేయకపోవడంతో ఆమె ఫ్యాన్స్ నిరుత్సాహపడుతున్నారు. కనీసం వచ్చే ఏడాది అయినా ఈ బ్యూటీ తెలుగులో తన జోరు చూపిస్తారేమో చూడాలి.

కొత్త సినిమా ఎప్పుడు?

తెలుగు పరిశ్రమలోకి 'ఉప్పెన'లా దూసుకొచ్చారు కృతీ శెట్టి. తొలి సినిమా 'ఉప్పెన '(2021) తో బేబమ్మగా తెలుగు ప్రేక్షకుల మనసులను దోచారీ బ్యూటీ. గత ఏడాది (2022) కృతీ శెట్టి నటించిన 'బంగార్రాజు, ది వారియర్, మాచర్ల నియోజకవర్గం, ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి' సినిమాలు రిలీజయ్యాయి. ఈ ఏడాది ఆమె నటించిన తెలుగు చిత్రం 'కస్టడీ' ఒక్కటే రిలీజ్ అయింది. ఆ చిత్రం విడుదలై ఆర్నెల్లు దాటినా మరో తెలుగు సినిమా సైన్ చేయలేదు కృతి. తెలుగులో మోస్ట్ హ్యాపెనింగ్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్న ఈ బ్యూటీ ప్రస్తుతం మలయాళంలో 'అజయంతే రండం మోషణం', తమిళంలో 'జెనీ' సినిమాలు చేస్తున్నారు. మరి.. కృతీ డైరీలో కొత్త తెలుగు సినిమా చేరేది ఎప్పుడు?

ఈ ఏడాది 'దసరా, భోళా శంకర్' సినిమాలతో ప్రేక్షకులను అలరించారు కీర్తీ సురేశ్. ఆ చిత్రాల తర్వాత మరో తెలుగు సినిమా అంగీకరించని కీర్తి తమిళంలో నాలుగు సినిమాలు చేస్తున్నారు. ఆమె నటించనున్న తదుపరి తెలుగు సినిమా ఏంటి? అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. అదే విధంగా గత ఏడాది విడుదలైన 'ఆచార్య' సినిమా తర్వాత మరో తెలుగు సినిమా ఒప్పుకోలేదు పూజా హెగ్డే. మహేశ్‌బాబు 'గుంటూరు కారం'లో హీరోయిన్‌గా ఎంపికైనా ఎందుకనో ఆ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారీ బ్యూటీ. అలాగే 'నన్ను దోచుకుందువటే' (2018) సినిమాతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన నభా నటేశ్ ఆ తర్వాత వరుసగా తెలుగు చిత్రాలు చేశారు. అయితే 'మాస్ట్రో' (2021) తర్వాత ఇప్పటివరకూ ఆమె మరో తెలుగు సినిమాపై ఎలాంటి సమాచారం లేదు. అదే విధంగా మెహరీన్, నిధీ అగర్వాల్, అనూ ఇమ్మాన్యుయేల్ వంటి హీరోయిన్ల జోరు కూడా తెలుగులో తగ్గింది. మెహరీన్ ఈ ఏడాది 'స్పార్క్' (తెలుగు–తమిళ్) లో నటిస్తున్నారు. ఆ తర్వాత ఆమె నటించే తెలుగు సినిమాపై క్లారిటీ లేదు. అలాగే ఈ ఏడాది ఏప్రిల్‌లో రిలీజైన 'రావణాసుర' చిత్రం తర్వాత అనూ ఇమ్మాన్యుయేల్ ఏ తెలుగు సినిమాలోనూ నటించడం లేదు. అలాగే నిధీ అగర్వాల్ చేతిలోనూ 'హరి హర వీరమల్లు' మినహా మరో తెలుగు సినిమా లేదు. ఈ సినిమా ఎప్పుడో ఒప్పుకున్నారామె. అయితే షూటింగ్ ఆలస్యం అవుతోంది. ఈ చిత్రం తర్వాత వేరే ఏ తెలుగు సినిమా కూడా ఆమె కమిట్ కాలేదు.



● మెహరీన్ ● అనూ ఇమ్మాన్యుయేల్ ● కీర్తి సురేశ్ ● పూజా హెగ్డే ● నభా నటేశ్ ● నిధీ అగర్వాల్



● అశోక్ వర్ధన్, సునీల్ బలుసు, విజయశాంతి, కల్యాణ్ రామ్, సయీ మంజ్రేకర్, ప్రదీప్ చిలుకూరి

కొత్త సినిమా షురూ

కల్యాణ్ రామ్ హీరోగా కొత్త సినిమాకి కొబ్బరికాయ కొట్టారు. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సయీ మంజ్రేకర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. నటి విజయశాంతి కీలక పాత్ర పోషిస్తున్నారు. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్‌పై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్న ఈ సినిమా శుక్రవారం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి మురళీ మోహన్ కెమెరా స్విచ్చాన్ చేయగా, విజయశాంతి క్లాప్ కొట్టారు. ముప్పా వెంకయ్య చౌదరి స్క్రిప్ట్‌ని దర్శకునికి అందించారు. ''భారీ బడ్జెట్, అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందుతున్న చిత్రమిది. కల్యాణ్ రామ్ పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. ఆయన కెరీర్‌లో ఈ సినిమా ఓ మైలురాయిగా నిలిచిపోతుంది. త్వరలోనే ఇతర నటీనటులు, పూర్తి వివరాలను తెలియజేస్తాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: బి. అజనీష్ లోక్‌నాథ్, కెమెరా: సి. రామ్ ప్రసాద్.

అనుకున్నవన్నీ జరగవు



● 'అల్లరి' నరేశ్, శ్రీరామ్

శ్రీరామ్ నిమ్మల, కలపాల మౌనిక జంటగా నటించిన చిత్రం 'అనుకున్నవన్నీ జరగవు కొన్ని'. జి. సందీప్ దర్శకత్వంలో శ్రీ భరత్ ఆర్ట్స్ సంస్థ నిర్మించిన ఈ చిత్రం నవంబర్ 3న రిలీజ్ కానుంది. ఈ చిత్రం పోస్టర్‌ను హీరో 'అల్లరి' నరేశ్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''పోస్టర్ ఆసక్తికరంగా ఉంది. నేను నటించిన 'సిల్లీ ఫెలోస్' చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేసిన సందీప్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవడం ఆనందంగా ఉంది'' అన్నారు. జి. సందీప్ మాట్లాడుతూ– ''క్రైమ్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రమిది. కామెడీని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు'' అన్నారు. ''నరేశ్‌గారు క్రైమ్, కామెడీ జానర్ చిత్రాలు ఎన్నో చేశారు. మా టైటిల్ లాంచ్ చేయడానికి ఆయనే కరెక్ట్ అనిపించింది'' అన్నారు శ్రీరామ్ నిమ్మల. ఈ చిత్రానికి కెమెరా: చిన్నా రామ్, జీవీ అజయ్, సంగీతం: గిడియన్ కట్ట, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: బీవీ నవీన్.

బేబి కాంబో రిపీట్



● ఆనంద్, వైష్ణవీ చైతన్య

'బేబి' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న హీరో ఆనంద్ దేవరకొండ, హీరోయిన్ వైష్ణవీ చైతన్య కాంబినేషన్‌లో మరో సినిమా రూపొందనుంది. 'బేబి' చిత్ర దర్శకుడు సాయి రాజేశ్ ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే, మాటలు అందిస్తున్నారు. ఈ చిత్రం ద్వారా రవి నంబూరి దర్శకునిగా పరిచయం అవుతున్నారు. అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్‌పై ఎస్‌కేఎన్, సాయి రాజేశ్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ''ఈ సినిమా ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. త్వరలోనే షూటింగ్ మొదలవుతుంది. వచ్చే వేసవిలో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం. మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బుల్గానిన్, కెమెరా: బాల్ రెడ్డి, సహనిర్మాత: ధీరజ్ మొగిలినేని.

స్థానిక వార్తలు

పేద గర్భిణులకు పెద్దన్న ఆకేపాటి



సీమంతం కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు



గర్భిణిని ఆశీర్వదిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

రాజంపేట టౌన్: పేద గర్భిణుల మోముల్లో చిరునవ్వు చూడటం కోసం సీమంతం నిర్వహించిన జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి వారికి పెద్దన్నలాంటి వారని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు కొనియాడారు. మండలంలోని ఆకేపాటి ఎస్టేట్‌లో శుక్రవారం ఆకేపాటి ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక సీమంతం కార్యక్రమంలో జిల్లాలోని పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ సేవాకార్యక్రమాలు చేపట్టడంలో ఆకేపాటి తనకు తానే సాటి అని తెలిపారు. రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని వందలాది మంది గర్భిణులను ప్రత్యేక వాహనాల్లో ఇక్కడికి తీసుకొచ్చి తోబుట్టువులా సీమంతం చేయడం గొప్ప విషయమని తెలిపారు. ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి మాట్లాడుతూ తన తోబుట్టువులవలే పేదలు కూడా ఆనందంగా ఉండాలన్నదే తన కోరిక అన్నారు. అందువల్లే వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం గర్భిణులకు చీర, జాకెట్, పసుపుకుంకుమ, పండ్లు పెట్టి సంప్రదాయబద్ధంగా సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీఓ జీ.రామకృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, ఆప్కో చైర్మన్ ఝాన్సీ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, ఆకేపాటి మురళీరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొల్లినేని రామ్మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో పోటీలు ప్రారంభం

● జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన ఎంఈఓ రుక్మిణీ
● హాజరైన 13 జిల్లాల క్రీడాకారులు





పోటీల్లో పాల్గొనేందుకు వస్తున్న క్రీడాకారులు (ఇన్‌సెట్) జ్యోతి వెలిగిస్తున్న ఎంఈఓ రుక్మిణీ

యాదమరి(చిత్తూరు జిల్లా): యాదమరి ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో పోటీలు అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. ఎంఈఓ రుక్మిణీ, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి జ్యోతి ప్రభలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలలో పాల్గొనడానికి 13 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. సాయంత్రం మండల కేంద్రంలోని మెయిన్ బజారులో జిల్లాల క్రీడాకారులు డ్రమ్స్ వాయిస్తు ర్యాలీలా ఊరేగింపుగా వచ్చారు.

ఘనంగా ప్రారంభోత్సవం

రాష్ట్రస్థాయి జూనియర్ బాల బాలికల ఖోఖో పోటీలు ఘనంగా ప్రారంభించారు. సాయంత్రం 6 గంటలకు ఎంఈఓ రుక్మిణీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రీడా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సం దర్భంగా దసరా సెలవుల్లో రాష్ట్ర స్థాయి క్రీడా సంబరాలు నిర్వహించడం మండలానికే గర్వకారణమన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు 13 జిల్లాల నుంచి క్రీడాకారులు రావడం సంతోషకరమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడమే గాక క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. దీనిపై ఆంధ్రా ఆడుదాం కార్యక్రమం ద్వారా క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరం అన్నారు. క్రీడలతో మానసికంగా దృఢంగా ఉంటారని తెలియజేశారు. అనంతరం క్రీడా పోటీల సంబరాలను టపాకాయలు పేలుస్తూ అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యాదమర్రి ఎస్ఐ సుమన్, మండల వైస్ ఎంపీపీ రవీంద్రబాబు, హరనారాయణ రెడ్డి, రాష్ట్ర ఖోఖో సంఘ కార్యదర్శి సీతారాం రెడ్డి, కన్వీనర్ ప్రసాద్, జిల్లా ఖోఖో సంఘ అధ్యక్షులు ప్రవీణ్, కార్యదర్శి శరత్‌బాబు, జిల్లా చీఫ్ కోచ్ బాలాజీ, ఆర్గనైజర్ సెక్రటరీ సురేష్, పీడీలు పాండ్యన్, రాజేష్ ముత్తు, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజుల పాటు నిర్వహణ

హోరా హోరీగా ప్రారంభమైన పోటీలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. బాల బాలికల జూనియర్ ఖోఖో పోటీల్లో శుక్రవారం సాయంత్రం చిత్తూరు వెస్ట్ గోదావరి, కర్నూలు, ఈస్ట్ గోదావరి జట్లు తలపడ్డాయి. రాత్రి 10 గంటల వరకు పోటీలు జరిగాయి. శనివారం ఉదయం 9 గంటలకు, సాయంత్రం 4 గంటలకు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రభుత్వ భూమి కబ్జా

● టీడీపీ నేత కుమారుడు, మీడియా ప్రతినిధి హస్తం
● ఎంపీ అవినాష్‌రెడ్డికి ప్రజాప్రతినిధుల ఫిర్యాదు

వేంపల్లె: వేంపల్లె పట్టణంలో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. గండి బైపాస్ రోడ్డులోని సర్వే నంబర్ 1147–2Dలో టీడీపీ నేత కుమారుడి భూమి పక్కన 50 సెంట్ల ప్రభుత్వ భూమి (డీకేటీ) ఉంది. ఎకరా కోటి రూపాయలతో టీడీపీ నేత కుమారుడు ఓ మీడియా ప్రతినిధి సాయంతో వేరొకరికి విక్రయించారు. పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేశారు. ఒక మూర రూ.1.20 లక్షల చొప్పున విక్రయాలు జరుపుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే ఇటీవల వేంపల్లెలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించడంతో.. ప్రజాప్రతినిధులు(ఎంపీటీసీలు) వారికి ఒక్కొక్కరికి రెండు సెంట్ల చొప్పున ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు. అందుకు స్పందించిన ఎంపీ ప్రభుత్వ భూమిని చూసి వెంటనే వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని తహసీల్దార్‌కు సూచించారు. అందుకు ప్రజాప్రతినిధులు గండి రోడ్డులో ఉన్న ప్రభుత్వ స్థలం ఉందని తహసీల్దార్‌కు తెలియజేశారు. దీంతో ఆయన నీళ్లు నమిలారు. విషయం తెలుసుకున్న ప్రజాప్రతినిధులు వేంపల్లెలో ఎంపీని కలిసి తహసీల్దార్‌పై ఫిర్యాదు చేశారు.

ఫెన్సింగ్ వేసేందుకు చర్యలు: ఈ విషయంపై తహసీల్దార్ ఎన్.చంద్రశేఖరరెడ్డిని వివరణ అడగగా.. స్థానిక ప్రజాప్రతినిధులు గండి రోడ్డులో సర్వే నంబర్ 1147–2డిలో ప్రభుత్వ స్థలం భూమి ఉందని తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. అక్కడ సిమెంటు పోల్‌లు నాటి ఫెన్సింగ్ వేసేందుకు చర్యలు తీసుకుంటున్నానని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఎవరు ఆక్రమించినా చర్యలు తీసుకుంటానన్నారు.

పాలస్తీనాపై దాడులు అమానుషం



మానవ హారంగా ఏర్పడిన ముస్లిం సోదరులు

కమలాపురం: పాలస్తీనా పై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులు అమానుషం అని కమలాపురం పెద్ద దర్గా పీఠాధిపతి హజరత్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి తెలిపారు. దర్గా ఎదుట ప్రధాన రహదారిలో వైఎస్సార్ సీపీ యువనేత ఇస్మాయిల్ ఆధ్వర్యంలో శుక్రవారం మానవహారం ఏర్పాటు చేసారు. దాడులకు నిరసనగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ ఒక దేశంపై మరో దేశం దాడులు చేయడం అమానుషం అన్నారు. దాడులతో వేలమంది అమాయక ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారులు మొదలుకొని వృద్ధుల వరకు రక్తమోడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దాడుల వలన కలిగే ప్రయోజనం ఏంటని ఆయన ప్రశ్నించారు. మనకెందుకులే అని అందరూ నిశ్శబ్దం పాటిస్తే ఆ దాడులు మన వరకు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. మనమందరం ఏక తాటిపైకి వచ్చి ముస్లిం దేశాలపై జరుగుతున్న దాడులను ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దస్తగిరి స్వామి, మౌలానా స్వామి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గౌస్ పాక్, సర్ఫరాజ్, ఫయాస్, ఫైజ్, ముస్లిం మత పెద్దలు, అన్ని మస్జిద్‌ల ఇమాంలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

టీడీపీ జెండా ఎగరనివ్వం: రాచమల్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, చిత్రంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరులో టీడీపీ జెండా ఎగరనివ్వమంటూ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని ఆటో నగర్ వద్ద రూ.25లక్షలతో నిర్మించనున్న కల్వర్టు, డ్రైనేజీ కాలువ నిర్మాణానికి శుక్రవారం సాయంత్రం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి భూమి పూజ చేశారు. అనంతరం గోపవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మొక్కలు నాటి తేనీటి విందు సేవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుటుంబంలో సమస్యలు వచ్చినప్పుడు ఎలా సర్దుకుపోతామో, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో కూడా అలానే ఉంటామన్నారు. 1984 నుంచి శివచంద్రారెడ్డి, తాను కలిసిమెలసి తిరిగామని.. ఆయన మాటలతో టీడీపీ లబ్ధి పొందాలంటే కుదురుతుందా అని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి చలోక్తి విసిరారు. గతంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఖాజా కూడా అలానే కలిసిపోయాడని తెలిపారు. ఏది ఏమైనా టీడీపీ జెండా ఎగరనివ్వకుండా ఉండేందుకు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మహిళలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి

కడప రూరల్: చట్ట సభల్లో ఓబీసీ మహిళలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్‌రావు తెలిపారు. కడపలోని హరిత హోటల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మహిళా బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదింప చేసిందన్నారు. ఈ బిల్లు కారణంగా దేశంలో 50 శాతానికి పైగా ఉన్న ఓబీసీ మహిళలకు అన్యాయం జరిగిందన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు బంగారు నాగయ్య యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, బత్తల లింగమూర్తి, జయశ్రీ పాల్గొన్నారు.

ఆచార్యుడికి అంతర్జాతీయ గుర్తింపు

స్టాన్‌ఫోర్డ్ ప్రపంచ పరిశోధకుల జాబితాలో ద్వితీయ స్థానం



ఆచార్య ఎం.వి. శంకర్

వైవీయూ: ప్రపంచ పరిశోధకుల ద్వితీయ స్థానంలో నిలిచి భేష్ అనిపించారు యోగి వేమన విశ్వవిద్యాలయం ఆచార్యులు ఎ.వి.శంకర్. మెటీరియల్ సైన్స్ అండ్ నానో టెక్నాలజీలో చేసిన పరిశోధనకు ఆయనకు ఈ గుర్తింపు లభించింది. 2001–23 మధ్య స్కోపస్ ఇండెక్స్ జర్నల్స్‌లో పరిశోధన ప్రచురణల ఆధారంగా స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల జాబితా (డేటాబేస్) రూపొందించింది. 1,90,063 మంది ప్రపంచ ప్రఖ్యాత పరిశోధకులు ఇందులో ఉండగా, వైవీయూ మెటీరియల్ సైన్స్ అండ్ నానో టెక్నాలజీ విభాగం ఆచార్యులు డా.ఎం.వి.శంకర్ ద్వితీయ స్థానం దక్కించుకుని అత్యంత ప్రభావవంతమైన శాస్త్రవేత్తల్లో ఒకరుగా నిలిచారు. వరుసగా జాబితాలో ఆయన చోటు దక్కించుకోవడం ఈయనకు ఇది నాలుగోసారి. దీంతో వైస్ ఛాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, అధ్యాపకులు ఆయనను అభినందించారు.

ఎన్నో పరిశోధనలు

ఆచార్య ఎం.వి.శంకర్ రెండు దశాబ్దాలుగా విశిష్ట పరిశోధనలు చేస్తున్నారు. సూర్యకాంతి వికిరణం, సూక్ష్మ పదార్థాల బహుళ ఫంక్షనల్ అప్లికేషన్ కింద ఫొటోకాటలిస్టులుగా సమర్థవంతమైన సూక్ష్మ పదార్థాల వినియోగం, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి రంగం, డీ ఫ్లోరిడేషన్ డ్రింకింగ్ వాటర్, తదితర అంశాల్లో క్రియాశీలకంగా పరిశోధనలు చేశారు. విదేశాల్లోనూ ఈయన పరిశోధనలకు గుర్తింపు లభించింది. వివిధ శాస్త్రీయ సంస్థల నుంచి 8 ఫెలోషిప్‌లు, 5 అవార్డులు, 4 గ్రాంట్లు అందు కున్నారు. దీంతోపాటు ఏపీ సైంటిస్ట్, ఏపీ స్టేట్ మెరిటోరియస్ టీచర్, యూకే నుంచి ఫెలో ఆఫ్ రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ పురస్కారాలు దక్కాయి. ఈయన 118 పరిశోధక/రీవ్యూ ఆర్టికల్స్ రాయగా 20 బుక్ చాప్టర్, 3 మోనోగ్రాఫ్‌లను అంతర్జాతీయ పత్రికలలో ప్రచురించారు. ఈయన పరిశోధనలకు ఆరు పేటెంట్లు పొందారు. జాతీయ సమావేశాలలో ఆహ్వాన చర్చలతో పాటు అధ్యక్షత వహించిన ఘనత ఉంది.

సాక్షి ఫ్యామిలీ
వైఎస్ఆర్ జిల్లా
శనివారం ॥ 21-10-2023

న్యూస్‌మేకర్



రుక్సార్ సయీద్

టేస్ట్ ఆఫ్ కశ్మీర్

కశ్మీర్ పేరు చెప్తే అందమైన ప్రదేశాలే గుర్తొస్తాయి. కాని ఆ లోయలో దాగిన రుచులు అన్వేషిస్తే తప్ప తెలియదు. శాకాహారమైనా మాంసాహారమైనా స్వచ్ఛమైన దినుసులతో గుమ్మెత్తిస్తారు. 'మేము ఎలా వండుతామో నా వంట చూసి తెలుసుకోండి' అని కశ్మీర్ వంట చేసి చూపుతోంది రుక్సార్ సయీద్. కశ్మీర్ మహిళలు పెద్దగా పాల్గొనని 'మాస్టర్ షెఫ్ ఆఫ్ ఇండియా' తాజా సిరీస్‌కు రుక్సార్ స్పెషల్ అట్రాక్షన్ అయ్యింది. పోటీని తట్టుకుని టాప్ 12లో నిలిచిన ఆమెను చూసి కశ్మీర్‌లో ఆడవాళ్లు గర్విస్తున్నారు.

సోనీ లివ్‌లో ప్రసారమవుతున్న తాజా సీజన్ 'మాస్టర్ షెఫ్ ఆఫ్ ఇండియా' కోసం రుక్సార్ సయీద్ (33) 'షట్ దేక్' అనే కశ్మీరీ వంట చేసింది. 'ఇది మా అమ్మమ్మ నుంచి మా అమ్మకు, మా అమ్మ నుంచి నాకు అందిన వంట. ముదురు గుమ్మడికాయ, నాటుకోడి, ఆల్ బకారా ఎండుగుజ్జు వేసి చేస్తాం. చాలా బాగుంటుంది' అంది. జడ్జీలుగా ఉన్న ప్రముఖ షెఫ్‌లు వికాస్ ఖన్నా, రణ్‌వీర్ బ్రార్, పూజా ధింగ్రా... కొద్దిగా రుచి చూసి 'అద్భుతం' అన్నారు. ఆమె ఇంకో ఎపిసోడ్‌లో 'షికారా రైడ్' అనే అల్పాహారం చేసింది. మటన్ కోఫ్తాను, పుదీనా మసాలాతో రంగరించి చేసింది. టేస్ట్ అదిరిందని వేరే చెప్పాలా?

'కశ్మీర్ లోయంతా రకరకాల మసాలా దినుసులు, మేం మాత్రమే తినే ఆకుకూరలు, కాయగూరలు ఉన్నాయి. వాటిని వండే పద్ధతి అందరికీ తెలియదు. మాస్టర్ షెఫ్ ద్వారా దేశమంతటికీ ఆ రుచులను తెలియజేయాలనుకుంటున్నాను' అంటుంది రుక్సార్ సయీద్.

ఆమె సంకల్పం గట్టిదిలాగుంది. తాజా సీజన్‌లో మహా మహా వంటగాళ్లు, వంటగత్తెలు పోటీ పడితే తుది జాబితాలో 22 మంది ఉంటే, వారిలో చాలామందిని అధిగ'మించి' టాప్ 12కు చేరింది రుక్సార్. దాంతో కశ్మీర్‌లో ఇప్పుడు ఈ షోను అక్కడి స్త్రీలు చూస్తున్నారు. రుక్సార్‌ను తమ ప్రతినిధిగా, తమ సామర్థ్యాలకు కొలమానంగా చూస్తున్నారు. 'ఆ సంతోషం చాలు నాకు. నన్ను స్ఫూర్తిగా తీసుకుని స్త్రీలు ముందుకు రావాలి' అంటుంది రుక్సార్.



ఫుడ్ టెక్నాలజీలో డాక్టరేట్

రుక్సార్ సయీద్‌ది పుల్వామా జిల్లాలోని పామ్‌పోర్ అనే ప్రాంతం. నిత్యం మంచు కురిసే ఈ ప్రాంతంలో కవులు ఎక్కువ. 'నేను కవిత్వం రాయను. కాని ప్లేట్‌లో పదార్థమే ఒక కవిత్వమంత అందంగా అమర్చగలను' అంటుంది రుక్సార్. ఫుడ్ టెక్నాలజీలో పీహెచ్‌డీ చేసిన రుక్సార్ అందరిలా ఏ లెక్చరర్ పోస్ట్‌కో వెళ్లలేదు. 'నాకు ఆహారం మీద సంపూర్ణ అవగాహన ఉంది. ముఖ్యంగా ఫ్రోజెన్ ఫుడ్‌ను సరిగా అమ్మగలిగితే తక్షణం వేడి చేసుకుని తినాలనుకునేవారికి మేలు జరుగుతుంది. కాని ఆహారంలో కల్తీ ఎక్కువ. ఈ కల్తీ విషంతో సమానం. అందుకే నేను ఏ కల్తీ లేని ఫ్రోజెన్ ఫుడ్‌ను అమ్మాలని ఖాలిస్ ఫుడ్స్ పేరుతో చిన్న సంస్థను మొదలుపెట్టాను. చికెన్ ఉత్పత్తులను కశ్మీర్‌లో అమ్ముతున్నాను. కశ్మీర్‌లో ఉద్యోగం చేయడం కన్నా ఉద్యోగాలు కల్పించడమే ఎక్కువ అవసరం అని నేను భావిస్తాను. నిరుద్యోగం పోవాలంటే ఇలాగే చేయాలి. నా సంస్థ బాగా నడుస్తోంది. కాని దేశవ్యాప్తంగా పంపాలంటే కొన్ని చిక్కులు ఉన్నాయి. ఈ లోపు నేను, నా బ్రాండ్ తెలియడానికి మాస్టర్ షెఫ్ ప్రోగ్రామ్‌కు వచ్చాను' అని తెలిపింది రుక్సార్.

అంతే తేడా

'వంట అందరు ఆడవాళ్లు చేస్తారు. కాని ఫుడ్ షోలలో ఆ వంటను శాస్త్రీయంగా చేయాలి. అంతే తేడా. కశ్మీర్‌లో వంట తెలిసిన యువతీ యువకులు బాగానే ఉన్నారు. నేను ఈ షో ద్వారా గడించిన అనుభవంతో వారికి సాయం చేయాలనుకుంటున్నాను. ఆహారం తయారు చేయడంలో మెళకువలు తెలిపి వారు ఫుడ్ జాయింట్‌లు ఏర్పాటు చేసుకుని తమ కాళ్ల మీద తాము నిలబడేలా చూడాలనుకుంటున్నాను. ఇందుకు కావాల్సిన సామాగ్రి నేనే సమకూరుస్తాను' అంది. ఒక కొడుకు, ఒక కూతురు ఉన్న రుక్సార్ తన భర్త సాదిక్ అహ్మద్ సహకారం వల్లే ఇలా షోకు వచ్చినట్టుగా తెలిపింది. 'ఆడవాళ్లూ.. ప్రయత్నించండి. ఓడిపోవద్దు' అనేది రుక్సార్ సందేశం.

ప్రమాదమా..? టాన్యా ఉందిగా..!



కాస్త ఖాళీ సమయం దొరికినప్పుడు... సెలవుల్లో స్నేహితులతో కలసి ట్రెక్కింగ్‌కు వెళ్తుంటారు చాలామంది యువతీ యువకులు. అయితే అనుకోకుండా ఏదైనా ప్రమాదంలో చిక్కుకుంటే వారిని ఎవరు కాపాడతారు? అందుకే అలాంటి వారికి అండగా ఉంటోంది టాన్యా. అవును, సరదాగా గడపాల్సిన వయసులో ఇతరుల ప్రాణాలను రక్షిస్తోంది టాన్యా కోలి. ఐదోఏటి నుంచే కొండలు ఎక్కడం నేర్చుకుని, టీనేజ్‌లోకి వచ్చినప్పటి నుంచి ఏకంగా రెస్క్యూ టీమ్‌ను నిర్వహిస్తూ ఎంతోమందిని ఆపదల నుంచి బయటపడేసింది. పెద్ద పెద్ద కొండలను అవలీలగా ఎక్కేస్తూ, మరొకరికి సాయంగా నిలబడుతూ.. నేటి యువతరానికి స్ఫూర్తిగా నిలుస్తోంది టాన్యా.

నాసిక్‌కు చెందిన టాన్యా కోలి ఐదేళ్ల వయసు నుంచే పర్వతాలు ఎక్కడం నేర్చుకోవడం మొదలు పెట్టింది. టాన్యా తండ్రి దయానంద్ కోలి నాసిక్ క్లైంబర్స్ అండ్ రెస్క్యూయర్స్ అసోసియేషన్‌లో పని చేస్తుండడంతో తరచూ ట్రెక్కింగ్, రెస్క్యూ అనే పదాలను తండ్రి నోట వెంట వినేది. టాన్యాకూ ట్రెక్కింగ్ పైన ఆసక్తి ఏర్పడడంతో తండ్రి దగ్గర ట్రెక్కింగ్ ఎలా చేయాలో నేర్చుకుంది. అలా ట్రెక్కర్‌గా మారిన టాన్యా, రెస్క్యూటీమ్ కలిసి ఎంతోమందిని ప్రమాదాల నుంచి బయటపడేస్తోంది. తండ్రి దగ్గర నేర్చుకున్న ట్రెక్కింగ్ మెళకువలతోపాటు, హిమాలయాల్లో ప్రత్యేకమైన శిక్షణ కూడా తీసుకుంది. ప్రమాదంలో ఉన్న వారిని కాపాడడంతోపాటు, పర్వతారోహకులకు ట్రెక్కింగ్‌లో శిక్షణ ఇస్తోంది టాన్యా. పర్వతాన్ని అధిరోహించేటప్పుడు జరిగే ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలో కూడా నేర్పిస్తుంది. టాన్యా దగ్గర శిక్షణ తీసుకుంటున్నవారిలో మహారాష్ట్ర పోలీసు అకాడమీ ట్రైనీలు కూడా ఉన్నారు. ప్రతిసారీ తను అందుబాటులో ఉండడం కష్టం కాబట్టి ఇతరులకు నేర్పించడం ద్వారా ప్రమాద సమయంలో వారిని వారే కాపాడుకోవడంతోపాటు, ఇతరులను కూడా కాపాడగలరు. అందుకే మరింతమందికి రెస్క్యూలో శిక్షణ ఇస్తున్నాను అని టాన్యా చెబుతోంది.

''ప్రమాదంలో ఉన్నారు, కాపాడాలి అని సమాచారం తెలిస్తే వెంటనే బయలుదేరతాం. అది అర్ధరాత్రి అయినా ఫస్ట్ ఎయిడ్ కిట్‌తో సిద్ధంగా ఉంటాం. ట్రెకింగ్ చేసేవారిని, ప్రమాదంలో ఉన్న వ్యక్తుల్ని రక్షించడం థ్రిల్లింగ్ ఇచ్చేదే అయినప్పటికీ చాలా సవాళ్లతో కూడుకున్నది. సమస్యలు ఉన్నప్పటికీ అవతలి వారిని ప్రమాదం నుంచి కాపాడగలిగామన్న సంతృప్తి ముందు ఆ సమస్యలు, సవాళ్లు చిన్నబోవలసిందే'' అని చెబుతోంది తాన్యా.

● సందర్భం

ఆమె సక్సెస్ మంత్రా...
వ్యూహ చతురత వృత్తి నిబద్ధత



ఇప్సితా దాస్‌గుప్తా

అనుభవం నేర్పిన పాఠాలు అద్భుత విజయాలను సొంతం చేస్తాయి. రెండు దశాబ్దాలకు పైగా ఎన్నో కార్పొరేట్ కంపెనీలలో పని చేసిన ఈప్సితా దాస్‌గుప్తా ఎన్నో విలువైన పాఠాలను నేర్చుకుంది. అమెరికాలో యాపిల్ సర్వీసెస్‌లో సీనియర్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్‌గా విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకుంది. తాజాగా... అమెరికన్ మల్టీ నేషనల్ ఐటీ కార్పొరేషన్ 'హెచ్‌పీ ఇండియా' సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (ఎస్‌వీపీ), మేనేజింగ్ డైరెక్టర్‌గా నియామకం అయింది...

పనిలోని కష్టమే ఇష్టమైతే అంతకంటే సుఖం ఏమున్నది? కొలంబియా యూనివర్శిటీలో మ్యాథ్స్, ఎకనామిక్స్‌లో డిగ్రీ, హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో ఎంబీఏ చేసిన ఈప్సితా ఎన్నో మల్టీ నేషనల్ కంపెనీలలో పనిచేసింది. ముంబై రోడ్లపై ఉరుకులు, పరుగులు, పని భారంతో నిద్రలేని రాత్రులు ఆమెకు కొత్తేమీ కాదు.

కుటుంబ జీవితాన్ని, వృత్తి జీవితాన్ని సమన్వయం చేసుకోవడంలో సమస్యలు తలెత్తాయి.

'నాకు కష్టంగా ఉంది' అని మాత్రం ఎప్పుడూ అనుకోలేదు.

ఎన్నో కంపెనీలలో మార్కెటింగ్, స్ట్రాటజీ విభాగాలకు నేతృత్వం వహించి మన దేశంతో సహా బంగ్లాదేశ్, శ్రీలంకలలో పనిచేసింది ఈప్సితా. ఆఫీస్ గదికే పరిమితం కాకుండా జనాల్లోకి వెళ్లి క్లయింట్స్ అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండేది. వాటికి అనుగుణంగా వ్యూహాలను రూపొందించుకునేది.

యాపిల్‌కు ముందు స్టార్ ఇండియా ప్రెసిడెంట్ ఆఫ్ కార్పొరేట్ స్ట్రాటజీ, జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీ దక్షిణ ఆసియా చీఫ్ కమర్షియల్ ఆఫీసర్‌గా పని చేసిన ఈప్సితా వృత్తికి సంబంధించి నిర్ణయాలు తీసుకునే ముందు ఒకటికి పదిసార్లు ఆలోచిస్తుంది. చిన్నాపెద్దా అనే తేడా లేకుండా అందరితో చర్చిస్తుంది.

'తీసుకున్న నిర్ణయాలను వెనక్కి తీసుకోవచ్చునేమోగానీ, ఆ నిర్ణయం ఫలితంగా ఉత్పన్నమయ్యే పరిస్థితులను వెనక్కి తీసుకోలేదు. అందుకే ఒక నిర్ణయం తీసుకునే ముందు వంద కోణాల్లో ఆలోచిస్తాను' అంటుంది ఈప్సితా.

ఉద్యోగంలోకి అప్పుడే వచ్చిన రోజుల్లో ఈప్సితాలాంటి కొత్త ఉద్యోగులకు సీనియర్‌ల నుంచి వినిపించిన మాట 'ఇలా ఎవరైనా ఆలోచిస్తారా?'

అందరిలాగే ఈప్సితా ఆలోచించి నట్లయితే ఆమెకు ఇంత పేరు వచ్చేది కాదేమో.

'ఇలా కూడా చేయవచ్చు... అంటూ సంప్రదాయ విధానాలకు భిన్నంగా ఆలోచించేదాన్ని. ఇది సీనియర్లకు రుచించేది కాదు. అయితే నా ఆలోచనల్లో సత్తా ఉందని ఆ తరువాత నిరూపణ అయింది' అంటుంది ఈప్సితా.

> 'మీకు ఇన్‌స్పిరేషన్ ఎవరు?' అనే ప్రశ్నకు ఈప్సితా చెప్పే జవాబు... 'వీరు వారు అని కాదు. నేను మాట్లాడే ప్రతి వ్యక్తి నుంచి ఎంతో కొంత ఇన్‌స్పైర్ అవుతుంటాను. సాధారణ ప్రజల నుంచి ఇన్వెస్టర్‌లు, లీడర్‌లు, ఆర్టిస్టుల వరకు నాకు ఎంతోమంది రోల్ మోడల్స్ కనిపిస్తారు'

వృత్తిరీత్యా ఈప్సితా దాస్‌గుప్తా ఒక సమస్యకు పరిష్కారం వెదకగానే పని అక్కడితో ఆగిపోదు. 'మేమున్నాం' అంటూ కొత్త సమస్యలు పుట్టుకొస్తుంటాయి. గత సమస్యలతో వీటికి పోలిక ఉండకపోవచ్చు. కొన్నిసార్లు పరిష్కారం దుర్భేద్యంగా అనిపించవచ్చు. ఇలాంటి సమయంలోనే వ్యూహకర్తలు చురుగ్గా ఆలోచించాలి.

వ్యూహకర్తగా ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపిన ఈప్సితా దాస్‌గుప్తా ఎంతోమందికి రోల్ మోడల్‌గా నిలిచింది.

బ్యూటిప్స్

కనుబొమలకు కలోంజీ





నల్లజీలకర్ర (కలోంజీ) విత్తనాలను పొడిచేయాలి. ఈ పొడిలో ఆలివ్ ఆయిల్, అలోవెరా జెల్‌ను వేసి చక్కగా కలపాలి. ఇప్పుడు తడి కాటన్ వస్త్రంతో కనుబొమలను శుభ్రంగా తుడిచి.. నల్ల జీలకర్ర మిశ్రమాన్ని ప్యాక్‌లా వేయాలి. ఇరవై నిమిషాలు ఆరాక కడిగేయాలి. కనుబొమ్మలను తడిలేకుండా తుడిచి కొద్దిగా ఆలివ్ ఆయిల్‌ను కనుబొమలపైన రాసి ఐదునిమిషాలపాటు మర్దన చేయాలి.

- ఈ ప్యాక్‌ను వారానికి మూడుసార్లు వేయడం వల్ల రక్తప్రసరణ చక్కగా జరిగి కనుబొమల మీద వెంట్రుకలు పెరుగుతాయి.
- నల్లజీలకర్ర ప్యాక్ పలుచటి కనుబొమలను ఒత్తుగా మారుస్తుంది. కనుబొమలు తీరైన ఆకృతిలో చక్కగా మెరుస్తాయి.
- కలోంజీలోని పోషకాలు కనుబొమల వెంట్రుకలు రాలకుండా చేస్తాయి.
- కనుబొమలు తెల్లబడడం మొదలైన వారు సైతం ఈ ప్యాక్‌ను వాడితే వెంట్రుకలు నల్లగా మారతాయి.

నేను జయించాను



డాక్టర్ మురళీకృష్ణ

వైద్యులు రోగులకు వైద్యం చేస్తారు. పేషెంట్ వ్యాధిని అంచనా వేసి, పరీక్షలతో నిర్ధారణకు వచ్చి, సిలబస్‌లో చదివిన సమాధానాలతో వైద్యం చేస్తారు. మరి... అప్పటివరకు లేని కొత్త రోగం వస్తే? చికిత్స కోసం అప్పటికే చదివిన సిలబస్‌లో సమాధానం ఎలా వెతకాలి? వైద్యవిద్యలో చెప్పని పాఠాల కోసం అన్వేషణ ఎలా మొదలు పెట్టాలి? అందుకే... 'పేషెంట్‌లు, పరిశోధనలే నా గురువులు' అన్నారు డాక్టర్ మురళీకృష్ణ. ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ... నిర్ధారిత ప్రయోగాలు, నిరూపిత సమీకరణలతో వైద్యం చేయడానికే పరిమితం కాకూడదు. రోగికి అవసరమైన కొత్త సమీకరణాలను వైద్యులు సృష్టించగలగాలన్నారు. బ్రాండ్స్ ఇంపాక్ట్ సంస్థ విశేషంగా వైద్యసేవలందించిన వైద్యులను ఇటీవల న్యూఢిల్లీలో గౌరవించింది. పేదవారికి తక్కువ ఖర్చుతో వైద్యం అందిస్తూ 'హెల్త్ కేర్ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్ 2023' పురస్కారం అందుకున్నారు తెలుగు డాక్టర్ మురళీకృష్ణ.

మైక్రో బయాలజీ నడిపించింది!

''మాది అంబేద్కర్ కోనసీమ జిల్లా, రామచంద్రాపురం. కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజ్‌లో ఎంబీబీఎస్, అదే కాలేజ్‌లో ఎం.డీ (మైక్రో బయాలజీ) కూడా చేసి, సాంక్రమిక వ్యాధుల నిపుణుడిగా ప్రాక్టీస్ చేస్తున్నాను. మైక్రో బయాలజీలో చేరడం ఇష్టంతో కాదని చెప్పడానికి ఏ మాత్రం మొహమాట పడను. సీటు వచ్చిన కోర్సుతో రాజీపడిపోయాను. కానీ కోర్సు మొదలైన తర్వాత ఏర్పడిన ఆసక్తిని మాటల్లో వర్ణించలేను. నేరుగా వైద్యం చేయడం కంటే వైద్యరంగానికి అవసరమైన తెర వెనుక కృషి చాలా సంతృప్తినిచ్చింది. గర్భిణులు, ఇతర వ్యాధిగ్రస్థులకు పరీక్షల కోసం సేకరించిన రక్త నమూనాలను తీసుకుని ఎయిడ్స్ వైరస్ గురించి ప్రభుత్వం చాలా గోప్యంగా పరీక్షలు నిర్వహించేది. మనదేశంలో వెయ్యిలో 15 మందిలో ఎయిడ్స్ వైరస్ ఉన్నట్లు, అది దక్షిణాది ఆఫ్రికా దేశాల నుంచి మనదేశంలోకి వస్తున్నట్లు తెలుసుకున్నాం. దేశంలో ప్రభుత్వ సంస్థల దగ్గర ఉన్న సమాచారమంతటినీ సేకరించాను. అన్ని సంస్థల దగ్గరున్న సమాచారం కంటే ఎక్కువ డాటా నా దగ్గరుంది. అప్పట్లో మనదగ్గర ఎయిడ్స్‌కి వైద్యం చేసే డాక్టర్‌లు లేరు. అనుబంధ సమస్యలకు వైద్యం చేసే నిపుణులే హెచ్‌ఐవీకి కూడా మందులిచ్చేవారు. ఆ ఖాళీని భర్తీ చేయాలనుకున్నాను. రెండు తెలుగు రాష్ట్రాల్లో తొలి హెచ్‌ఐవీ ఫిజీషియన్‌ని నేనే.

వారానికి ఇద్దరు పేషెంట్‌లు!

సొంత ప్రాక్టీస్ మొదలుపెట్టింది 2000లో. మొదట్లో వారానికి ఇద్దరు లేదా ముగ్గురు పేషెంట్‌లు వచ్చేవారు. దాంతో నా సమయాన్ని ఎయిడ్స్ అధ్యయనానికి ఉపయోగించాను. ప్రముఖ పరిశోధకులందరూ శాస్త్రం ఆధారంగా ఎయిడ్స్‌కు వైద్య శోధన మొదలు పెట్టారు. నా అధ్యయనం, పరిశోధనలను పేషెంట్ వైపు నుంచి మొదలు పెట్టాను. ఎయిడ్స్‌కి మాంటూక్స్ టెస్ట్ అలాంటిదే. ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులు వ్యాధినిరోధక శక్తిని కోల్పోయి టీబీ సోకడం సర్వసాధారణంగా జరిగేది. ఎయిడ్స్ మరణాల్లో ఎక్కువ టీబీ మరణాలే ఉండేవి. '13వ ఇంటర్నేషనల్ ఎయిడ్స్ కాన్ఫరెన్స్' సౌత్ ఆఫ్రికాలోని దర్బన్‌లో జరిగింది. ఆ సదస్సులో నేను 'మాంటూక్స్ టెస్ట్' ఎయిడ్స్ తీవ్రత పట్ల ఒక అంచనాకు రావచ్చని చెప్తూ నా పరిశోధన పత్రాన్ని సమర్పించాను. అది ఎయిడ్స్ చికిత్సలో కొత్త దృక్పథానికి దారి తీసింది. ఎయిడ్స్ చికిత్సలో వైద్యం మొదలు పెట్టిన వారం రోజుల నుంచి రికవరీ స్పష్టంగా తెలుస్తుంది. అయితే జీవితకాలం మందులు వాడాల్సిందే. పేషెంట్ తిరిగి తన పనులకు వెళ్లగలిగేటట్లు చేయడం నా వైద్యం ఉద్దేశం. ఈ వ్యాధి పేద వాళ్లలోనే ఎక్కువ. వారికి వైద్యం చేయడంలో టెస్ట్‌ల మీద ఆధారపడకుండా వ్యాధి లక్షణాలు, చిహ్నాలను బట్టి తీవ్రతను అంచనా వేసి చికిత్స చేస్తాను. అలాగే రెండంచెల ఔషధాలతో వైద్యం చేయడం కూడా నేను చేసిన మరో ప్రయోగం. ఫ్రాన్స్‌లో జరిగిన 'ఇంటర్నేషనల్ సింపోజియమ్ హెచ్‌ఐవీ ఎమర్జింగ్ మెడిసిన్' సదస్సులో పేపర్ సమర్పించాను. నేను ప్రతిపాదించిన పదేళ్ల తర్వాత 2019 నుంచి ఇప్పుడు అంతర్జాతీయంగా టూ డ్రగ్స్ చికిత్సనే అనుసరిస్తున్నారు.



'హెల్త్ కేర్ ఎక్స్‌లెన్స్ అవార్డ్ 2023' అందుకుంటున్న డాక్టర్ మురళీకృష్ణ

కోవిడ్‌కి ఇంట్లోనే వైద్యం

కోవిడ్ వైద్యరంగానికి పెద్ద సవాల్ అనే చెప్పాలి. ఒక వ్యాధికి మందులు రావాలంటే దశాబ్దాల పరిశోధన తర్వాత మాత్రమే సాధ్యం. కొత్త వ్యాధి, పైగా ఒక్కసారిగా విజృంభించినప్పుడు రోగులందరికీ ఒకేసారి నాణ్యమైన వైద్యం అందించడం ఎవరికీ సాధ్యం కాదు. వ్యాధి విస్తరించినంత వేగంగా ప్రత్యామ్నాయాల అన్వేషణ కూడా జరగాలన్న ఆలోచనతో సులభంగా, చవగ్గా దొరికే మందులతో హోమ్‌కేర్ కిట్ రూపొందించాను. కోవిడ్ మీద అవగాహన కోసం వీడియోలు చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాను. ఒక్కో పోస్ట్ వేలసార్లు షేర్ అయింది. వైద్యం కోసం పేషెంట్‌లు అప్పుల పాలు కాకూడదనేది నా పాలసీ. అందుకోసమే నా తాపత్రయమంతా. కోవిడ్ మీద కూడా అవగాహన పుస్తకం తెచ్చాను. కోవిడ్ తర్వాత వస్తున్న సమస్యల మీద అధ్యయనం ఇంకా కొనసాగుతోంది. నాలుగు ఇంటర్నేషనల్ సెమినార్‌లలో పేపర్‌లు ప్రెజెంట్ చేశాను. ఇంకా చేస్తాను కూడా. ఒక డాక్టర్‌గా వైద్యరంగం నేర్పించిన జ్ఞానంతో పేషెంట్‌లను ఆరోగ్యవంతులను చేయడానికి కృషి చేయడం అనేది నూటికి తొంభై తొమ్మిది మంది చేసే పని. నా కృషితో వైద్యరంగానికి తోడ్పాటు అందించడం నా విజయం. మొదట ఆరోగ్యపరంగా నన్ను నేను జయించాను. ఆ తర్వాత జీవితాన్ని జయించాను. మా ఇంట్లో తొలి వైద్యుడిని నేనే. నా పిల్లలిద్దరిలో ఎవరూ వైద్యరంగం పట్ల ఆసక్తి చూపకపోవడమే మనసుకు బాధ కలిగించే విషయం'' అన్నారు ప్రజారోగ్య పరిరక్షణలో జీవన సాఫల్య పురస్కారం అందుకున్న డాక్టర్ మురళీకృష్ణ.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఎయిడ్స్ అవగాహన వ్యాసాలు

హెచ్‌ఐవీ గురించి మన సమాజంలో విపరీతమైన భయం రాజ్యమేలుతున్న రోజులవి. ఆ వ్యాధి పట్ల అవగాహన కల్పించడం కోసం నగరాలు, పట్టణాలు, చిన్న కాలనీలు, గ్రామాల్లో ఐదు వందలకు పైగా సమావేశాల్లో ప్రసంగించాను. వయోజనుల్లో అవగాహన కోసం 'అక్షర గోదావరి' పేరుతో క్లుప్తంగా, సరళంగా సామాన్యులకు అర్థమయ్యే రీతిలో రాశాను. మొదట మా జిల్లాలో ప్రయోగాత్మకంగా మొదలు పెట్టిన ఆ ప్రాజెక్టును తర్వాత అన్ని జిల్లాలకూ విస్తరించారు. ఆశ వర్కర్స్, రీసోర్స్ పర్సన్స్‌కి ప్రామాణిక గ్రంథంగా నా రచననే తీసుకున్నారు. హెచ్‌ఐవీ గురించిన అవగాహన వ్యాసాలతో 'ఎయిడ్స్' పేరుతో పుస్తకాన్ని ప్రచురించాను. ఆ పుస్తకం పునర్ముద్రణలతో పదేళ్లలో ఎనిమిది వేల కాపీలు అమ్ముడవుతుందని నేను కూడా ఊహించలేదు. ఎంబీబీఎస్‌లో కాలేజ్ మ్యాగజైన్‌కి ఎడిటర్‌గా పని చేసిన అనుభవమే ఇప్పటికీ నా అధ్యయనాలన్నింటినీ అక్షరబద్ధం చేయిస్తోంది.

– డాక్టర్ యనమదల మురళీకృష్ణ, ఎం.డి., కాకినాడ, ఆంధ్రప్రదేశ్

ఇండస్ట్రీ 4 స్టార్టప్స్‌కు 'కల్పతరువు' విశాఖ

- దేశంలో తొలి ఇండస్ట్రీ 4 సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ కల్పతరువు
- తొలి దశలో 5 స్టార్టప్స్ ఏర్పాటు
- రెండో దశలో మరో 16 ఏర్పాటుకు రంగం సిద్ధం
- 13 సంస్థలు స్టీల్‌ప్లాంట్ సమస్యలపై పరిశోధనలు
- సాధారణ సమస్యలపై వినూత్న ఆవిష్కరణలకు సిద్ధంగా 8 స్టార్టప్‌లు
- ఆవిష్కరణలను మరిన్ని ప్రభుత్వరంగ సంస్థలకు విస్తరణ
- తాజాగా హిందుస్థాన్ షిప్‌యార్డ్‌తో ఒప్పందం
- ఎన్‌టీపీసీ, ఐవోసీఎల్ వంటి సంస్థలతో చర్చలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో స్టార్టప్‌లు యూనికార్న్ కంపెనీలు (కంపెనీ విలువ బిలియన్ డాలర్లకు చేరడం)గా ఎదగాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంకల్పానికి విశాఖ కేంద్రంగా మారుతోంది. పారిశ్రామిక రంగంలో నాలుగో తరం సాంకేతిక విప్లవంగా పేర్కొంటున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ), రోబోటిక్, ఆటోమేషన్, బిగ్ డేటా వంటి టెక్నాలజీల్లో నూతన ఆవిష్కరణలకు కేంద్ర స్థానమవుతోంది. విశాఖపట్నంలో ఏర్పాటైన దేశంలోనే మొట్టమొదటి ఇండస్ట్రీ 4 సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ 'కల్పతరువు'లో ఈ నూతన ఆవిష్కరణలపై పలు స్టార్టప్స్ సంస్థలు జోరుగా పరిశోధనలు సాగిస్తున్నాయి.

ఇండస్ట్రీ 4 ఆవిష్కరణలను ప్రోత్సహించేలా కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ), ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ సొసైటీ, రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) సంయుక్తంగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రాంగణంలో కల్పతరువు పేరిట సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ని రూ. 20 కోట్లతో ఏర్పాటు చేశాయి. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో వేడి ఉక్కు ద్రావణం ప్రవహించే చోట్ల, అధిక వేడి ఉండే కొలిమిల వద్ద మనుషులు పనిచేయడం చాలా కష్టం. ప్రమాదాలు జరిగే అవకాశాలూ ఎక్కువ. ఇలాంటి చోట మానవరహితంగా పూర్తి ఆటోమేటిక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసేలా కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడమే కల్పతరువు ప్రధాన ఉద్దేశం. ఇందులో భాగంగా ఆర్ఐఎన్ఎల్ ఉక్కు తయారీలో ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటికి నూతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పరిష్కారాన్ని చూపేలా పరిశోధనలు చేయడానికి ప్రాబ్లమ్ స్టేట్‌మెంట్స్‌ను ప్రకటిస్తూ ఉంటుంది. ఇలా ఆర్ఐఎన్ఎల్ ఇచ్చిన సమస్యలపై పరిశోధన చేసి నూతన ఆవిష్కరణలను కనుక్కోవడానికి అనేక స్టార్టప్ సంస్థలు విశాఖ కల్పతరువును వేదికగా చేసుకొంటున్నాయి. తొలి దశలో అయిదు స్టార్టప్స్ పరిశోధనలు ప్రారంభించాయి. తాజాగా రెండో దశలో మరో 16 స్టార్టప్స్ ఆవిష్కరణలను ఎంపిక చేసినట్లు సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) వైజాగ్ అడిషనల్ డైరెక్టర్ సురేష్ 'సాక్షి'కి తెలిపారు. రెండు దశలతో కలిపి 21 స్టార్టప్‌లు ఇక్కడ ఏర్పాటవుతున్నాయి. గతంలో ఏర్పాటైన 5 స్టార్టప్‌లు, తాజా స్టార్టప్‌లలో 8 కంపెనీలు స్టీల్‌ప్లాంట్ (ఆర్ఐఎన్ఎల్) సమస్యలపై పరిశోధనలకు ఏర్పాటయ్యాయి. మిగతా 8 స్టార్టప్‌లు సాధారణ సమస్యలపై పరిశోధన చేస్తాయి. ఈ 8 సంస్థలు అందరికీ ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చేలా వినూత్నమైన ఆలోచనలతో వచ్చాయని, అందుకే వాటిని ఎంపిక చేశామని సురేష్ చెప్పారు. తాజాగా వచ్చిన 16 స్టార్టప్స్ పరిశోధనల కోసం కల్పతరువులో ఇంక్యుబేషన్ సెంటర్‌తో పాటు ల్యాబ్, ఆర్థిక సహకారం వంటి ప్రయోజనాలను కల్పిస్తారు.

మరిన్ని ప్రభుత్వ రంగ సంస్థలకు విస్తరణ

ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్ సమస్యల పరిష్కారానికే పరిమితమైన కల్పతరువును మరిన్ని ప్రభుత్వరంగ సంస్థలకు విస్తరించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. తాజాగా మరో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ హిందుస్థాన్ షిప్‌యార్డ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నామని సురేష్ చెప్పారు. త్వరలోనే షిప్‌యార్డ్ సమస్యలను నాలుగో తరం సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కరించేలా ప్రాబ్లమ్ స్టేట్‌మెంట్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు. విశాఖ కేంద్రంగా పనిచేస్తున్న ఎన్‌టీపీసీ, విశాఖ పోర్టు, హెచ్‌పీసీఎల్ వంటి మరికొన్ని ప్రభుత్వరంగ సంస్థలతో కూడా చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు.

అలంకార అరటి.. ఆంధ్రా మేటి!

అర్నమెంటల్ బనానా సాగుకు అనువుగా గోదావరి జోన్

- ఉద్యాన వర్సిటీలో ఫలించిన పరిశోధనలు
- పుష్పగుచ్ఛాలు, గోడలపై అలంకరణల్లో వినియోగం
- వీటి ఆకులతో బయో ప్లేట్స్ తయారీ
- ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం



సాక్షి, అమరావతి: విదేశాల్లో విశేష ప్రాచుర్యం పొందిన అలంకార అరటి (అర్నమెంటల్ బనానా) సాగుకు ఆంధ్రప్రదేశ్ అనువైనదిగా గుర్తించారు. ఈ రకం అరటిని సాగు చేసేందుకు వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధకులు చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలిస్తున్నాయి. ప్రపంచ ఉద్యాన పరిశ్రమలో అలంకార అరటి రకాలు ఇటీవల కాలంలో విశేష ప్రాచుర్యం పొందుతున్నాయి. అలంకార అరటి రకాలు ఆహ్లాదం గొలిపేలా ఉంటాయి. అందమైన ఆకులు, పువ్వుల కోసం వీటిని పెంచుకుంటారు. అయితే.. ఇవి తినదగిన పండ్లను ఉత్పత్తి చేయలేవు.

6 నెలలకు రూ.లక్ష ఆదాయం

బ్రెజిల్, థాయ్‌లాండ్, మయన్మార్, చైనా దేశాలలో ఈ రకాలు విశేష ప్రాచుర్యంలో ఉన్నాయి. వీటికి ఆ దేశాల్లో మంచి డిమాండ్ కూడా ఉంది. నాలుగు మూసా జాతులను సంకరపర్చడం ద్వారా వీటిని అభివృద్ధి చేశారు. ఇవి చాలా పొట్టిగా, చిన్నగా.. చూసేందుకు అందంగా కనిపిస్తాయి. ఇంటి పెరట్లోనూ, కుండీలలోను ఈ రకాలను పెంచుకోవచ్చు. ఈ మొక్కలను కనీసం ఒకటిన్నర మీటర్ దూరంలో నాటుకోవచ్చు. నేల స్వభావాన్ని, తోటలోని అనువును బట్టి ఇంకా దగ్గరగా కూడా నాటుకోవచ్చు. వీటికి సోకే ఆకుమచ్చ, గొంగళి పురుగుల నివారణ కోసం కనీస సంరక్షణ చర్యలు చేపడితే చాలు. కుండీ మొక్కలు, ఇంటి ముంగిట, పెరటి తోటల్లో అందం కోసం నాటుకోవడానికి పిలకల్ని ఉత్పత్తి చేయడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చు. ప్రతి 6 నెలలకు ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం పొందే అవకాశం ఉంది. వీటి ఆకులను పుష్పగుచ్ఛాల్లో విరివిగా ఉపయోగిస్తుంటారు. గోడలపై అలంకరణలకు, బయో ప్లేట్స్‌గా కూడా ఉపయోగిస్తున్నారు. విదేశాల్లో మాత్రమే సాగవుతున్న ఈ రకాల సాగుకు రాష్ట్రంలోని గోదావరి జోన్‌లోని ఉష్ణ మండల ప్రాంతం అనువైనదిగా గుర్తించారు. ఆ దిశగా రైతులను ప్రోత్సహించే దిశగా ఉద్యాన విశ్వవిద్యాలయం కృషి చేస్తోంది.

సత్ఫలితాలిచ్చాయి



గోదావరి మండలంలో ప్రధాన పండ్ల అరటిలో అర్నమెంటల్ అరటి జాతుల సాగుపై చేసిన పరిశోధనలు సత్ఫలితాలిచ్చాయి. తేమతో కూడిన పరిస్థితులలో వీటి సాగుపై అధ్యయనం చేశాం. మన ప్రాంత వాతావరణానికి అనువుగా, వీటి సామర్థ్యాన్ని అంచనా వేయడానికి ఈ పరిశోధన ఎంతగానో దోహదపడుతుందని గుర్తించాం.

– డి.బేబి శ్రీదివ్య, ఎమ్మెస్సీ విద్యార్థిని, వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ

సత్ఫలితాలిస్తున్న పరిశోధనలు



పీహెచ్‌డీ విద్యార్థులు చేస్తున్న పరిశోధనలు సత్ఫలితాలిస్తున్నాయి. మన ప్రాంతం వీటి సాగుకు అనువైనదిగా గుర్తించాం. రైతులకు పరిశోధనా ఫలాలు అందించేందుకు పీహెచ్‌డీ విద్యార్థులు చేస్తున్న పరిశోధనలు ఉపయోగపడుతున్నాయి.

– డాక్టర్ ఎస్.సూర్యకుమారి, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్, వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ

మిరప.. రెపరెప

రికార్డు స్థాయిలో సాగు

- ఖరీఫ్‌లో సాధారణ విస్తీర్ణం 4.84 లక్షల ఎకరాలు
- 2022–23లో రికార్డు స్థాయిలో 5.70 లక్షల ఎకరాల్లో సాగు
- ఈ ఏడాది కనీసం 6.30 లక్షల ఎకరాలు దాటుతుందని అంచనా
- ఫలించిన సస్యరక్షణ చర్యలు.. నల్ల తామర సహా చీడపీడలు దూరం
- గతేడాది కంటే మిన్నగా దిగుబడులు వస్తాయని అంచనా



ఈ రైతు పేరు కంబాల బ్రహ్మం. పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం వెంకటాయపాలెం గ్రామానికి చెందిన ఈయన గతేడాది 2 ఎకరాల్లో మిరప సాగు చేశారు. ఈ ఏడాది బోరు కింద 4 ఎకరాల్లో మిరపను సాగు చేస్తున్నారు. ప్రభుత్వం, ఉద్యాన శాఖ అధికారుల అండదండలతో సాగు చేస్తున్నామని.. నల్ల తామర సహా చీడపీడలు, తెగుళ్ల ప్రభావం ఎక్కడా కనిపించలేదని బ్రహ్మం చెబుతున్నారు. ఈ ఏడాది దిగుబడితోపాటు గతేడాది కంటే మంచి ఆదాయం వస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు.

సాక్షి, అమరావతి

ఈ ఏడాది మిరప పంటను రైతులు రికార్డు స్థాయిలో సాగు చేస్తున్నారు. మంచి ధర పలుకుతుండటంతో ప్రతికూల వాతావరణంలోనూ భారీ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. నల్ల తామర సహా చీడపీడలు, తెగుళ్ల ప్రభావం పెద్దగా లేకపోవడం.. గత ఏడాది కంటే మిన్నగా దిగుబడులొచ్చే అవకాశం ఉండటంతో రైతుల్లో ఉత్సాహం కనిపిస్తోంది. రాష్ట్రంలో మిరప సాధారణ విస్తీర్ణం 4.87 లక్షల ఎకరాలు కాగా.. గతేడాది రికార్డు స్థాయిలో 5.70 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది ఇప్పటికే 6 లక్షల ఎకరాల్లో మిరప నాట్లు వేయగా.. నవంబర్ మొదటి వారం వరకు పంట వేసే అవకాశం ఉన్నందున అదనంగా కనీసం మరో 20–30 వేల ఎకరాల్లో సాగయ్యే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. సీజన్ ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులు ఒకింత కలవరపెట్టినప్పటికీ సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలు రైతులకు ఊరటనిచ్చాయి. గతేడాది కురిసిన వర్షాలతో భూగర్భ జలాలకు లోటు లేకపోవడంతో బోర్ల కింద రికార్డు స్థాయిలో పంటలు వేశారు.

సమృద్ధిగా ఎరువులు..
ఫలిస్తున్న సస్యరక్షణ చర్యలు

సీజన్ ఆరంభం నుంచి ప్రభుత్వం అండగా నిలవడంతో ఏ దశలోనూ విత్తనం, ఎరువుల కోసం రైతులు ఇబ్బందిపడలేదు. ఆర్బీకేల్లో సమృద్ధిగా ఎరువులు అందుబాటులో ఉంచడంతో గ్రామంలోనే పొందగలుగుతున్నారు. మరోవైపు నల్ల తామరను ఎదుర్కొనేందుకు ఆర్బీకే స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించడంతో రైతులు జాగ్రత్త పడ్డారు. ప్రస్తుతం పంట 85 శాతం ఏపుగా పెరిగే దశలో ఉండగా.. 15 శాతం పూత దశకు చేరుకుంది. ప్రభుత్వ చర్యల ఫలితంగా నల్లతామరతో సహా ఇతర చీడపీడలు, తెగుళ్ల జాడ కనిపించలేదు.



దిగుబడి.. ధరలపై ఆశలు

గతేడాది ఎకరాకు 18 నుంచి 23 క్వింటాళ్ల దిగుబడి రాగా.. ఈసారి 20–25 క్వింటాళ్లకు తగ్గదని అధికారులు చెబుతున్నారు. గతేడాది 11.50 లక్షల టన్నుల దిగుబడులు రాగా.. ఈ ఏడాది 12 లక్షల టన్నులకు పైగా వస్తుందని అంచనా వేస్తున్నారు. 2022–23లో గరిష్టంగా క్వింటాల్ ధర రూ.27 వేలు పలకగా.. ప్రస్తుతం కనిష్టం రూ.20వేలు, గరిష్టంగా రూ.29 వేలు, మోడల్ రకం రూ.24 వేల వరకు పలుకుతోంది. తొలుత మార్కెట్‌కు వచ్చే మధ్యప్రదేశ్ మిరపపై వర్షాభావ పరిస్థితులు ప్రభావం చూపడంతో మిరప ధర మరింత పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి. పంట కోతకొచ్చే సమయానికి రూ.30 వేల నుంచి రూ.32 వేలకు పైగా చేరవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

మిరపకు ఢోకా లేదు

మిరప గతేడాది కంటే మిన్నగా సాగవుతోంది. ఇప్పటికే 6 లక్షల ఎకరాలు దాటింది. సీజన్ ముగిసే నాటికి కనీసం 6.30 లక్షల ఎకరాలు దాటే అవకాశాలు ఉన్నాయి. ఆర్బీకే స్థాయిలో చేపట్టిన సస్యరక్షణ చర్యల వల్ల నల్లతామర, చీడపీడల ప్రభావం కనిపించలేదు. ప్రస్తుతం రికార్డు స్థాయిలో పెరుగుతున్న ధరలు వల్ల రైతులకు మంచి ఆదాయం వచ్చే అవకాశాలున్నాయి.

– ఎం.వెంకటేశ్వర్లు, అడిషనల్ డైరెక్టర్, ఉద్యాన శాఖ

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 and Printed at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 EDITOR: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 98481 50278, RNI Regn No. APTEL/2008/23796.